## జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు కావలెను




మనసర్కార్ దినపత్రిక, డిజిటల్ ఛానల్, న్యూస్ పోర్టల్ కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని ఉమ్మడి జిల్లాల వారీగా గతంలో ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మీడియాలో జిల్లా స్థాయిలో పని చేసిన అనుభవం ఉన్న రిపోర్టర్లు కావలెను.

మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు

మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540

Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073

Follow: manasarkar

email: jobs@manasarkar.com



సంక్షేమ

# మనసర్కార్

Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:237 | హైదరాబాద్ 30 మార్చి 2026, సోమవారం | పేజీలు: 8, వెల: రూ. 5/-

Vol-01 ::: Issue-237 | Hyderabad 30 March 2026, Monday | Pages: 8, Rs. 5/-



## అసెంబ్లీల వారీగా రిపోర్టర్లు కావలెను




మనసర్కార్ దినపత్రిక, డిజిటల్ ఛానల్, న్యూస్ పోర్టల్ కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వార్తలను సేకరించుటకు రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషపై పట్టు వార్తలను వ్రాయగలిగే సామర్థ్యం, సంఘటనలను వీడియో తీసి పంపగల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు

మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540

Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073

Follow: manasarkar

email: jobs@manasarkar.com


తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారిపై ఉక్కుపాదం మోపుతూ, తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో 'తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీతనం బిల్లు-2026'ను ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదించింది. భక్తితో కాకపోయినా కనీసం చట్టం అనే భయంతోనైనా వృద్ధులను చూసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# తల్లిదండ్రులకు రక్షణగా కాంగ్రెస్ సర్కార్

## అసెంబ్లీలో 'తల్లిదండ్రుల పోషణ బిల్లు' ఆమోదం

...::: పూర్తి కథనం 2వ పేజీలో...

'ఎవరు ఆడతారో వారే వికసిస్తారు' అనే మంత్రంతో దేశాభివృద్ధిలో యువత ముందుకు సాగాలని, ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' 132 ఎపిసోడ్‌లో పేర్కొన్నారు. 'మేరా యువ భారత్' ద్వారా యువతను సానుకూల దృక్పథంతో దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

# మేరా యువ భారత్

మన్ కీ బాత్ లో ప్రధాన మంత్రి మాట మంతి...


### యువశక్తే దేశ బలం

### క్రీడలు, దేశాభివృద్ధిపై ప్రధాని ప్రశంసలు



...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## అమెరికాకు ఇరాన్ బ్రిగేడియర్ హెచ్చరిక



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో అమెరికా గనుక భూతల దాడులకు సాహసిస్తే, ఆ దేశ సైనికులు సముద్రంలోని "షార్క్ చేపలకు ఆహారంగా" మారుతారని ఇరాన్ సాయుధ దళాల ప్రతినిధి, బ్రిగేడియర్ జనరల్ ఇబ్రహీం జొల్ఫకరి ఆదివారం విడుదల చేసిన వీడియో ప్రకటనలో హెచ్చరించారు. అమెరికా ఎలాంటి దురాక్రమణకు పాల్పడినా ధీటుగా బదులిచ్చేందుకు తమ సైన్యం సిద్ధంగా ఉందని, ఆక్రమణదారులు అవమానకరమైన ఓటమిని చవిచూడక తప్పదని ఆయన స్పష్టం చేశారు. ఇస్లాం యోధులు అటువంటి చర్యల కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నారని, అమెరికా కమాండర్లు , సైనికులు పర్షియన్ గల్ఫ్ షార్క్ లకు విందు భోజనం అవుతారంటూ ఆయన పేర్కొన్నారు.

...::: తరువాయి 2వ పేజీలో...

# ఒకే రాష్ట్రం - ఒకే రాజధాని!

## అట్టహాసంగా టీడీపీ 44వ ఆవిర్భావ వేడుకలు

అమరావతే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు | కార్యకర్తలే పార్టీకి అసలైన బలం | సామాన్యులను సైతం చట్టసభలకు పంపిన చరిత్ర టీడీపీదే..



టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళగిరిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. 'మూడు రాజధానుల ముక్కలాట ఇక ఉండదు.. అమరావతే మన ఏకైక రాజధాని' అని స్పష్టం చేశారు. త్యాగాలు చేసిన కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని ఆయన కొనియాడారు. హైదరాబాద్‌ను మించిన అద్భుత నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

మంగళగిరి (ఏడీఎన్ఎన్):

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇకపై మూడు రాజధానుల ముక్కలాట ఉండబోదని, ఒకే రాష్ట్రం ఒకే రాజధాని విధానమే అమలవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. అమరావతికి వ్యతిరేకంగా పనిచేసే శక్తులను ఇక్కడికి రాకుండా అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణం కోసం రైతులు ఎటువంటి స్వలాభం ఆశించకుండా భూములివ్వడం తెలుగుదేశం పార్టీపై వారికున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## యుద్ధం తెచ్చిన కష్టం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

అమెరికా, ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులతో ఇరాన్ పౌరుల జీవనం అస్తవ్యస్తమైంది. నిరంతర వైమానిక దాడులు, విద్యుత్ కోతలు , ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకడం, నిరంతర పేలుళ్ల శబ్దాలతో ఇళ్లు ధ్వంసమవడమే కాకుండా, చిన్నారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి తాత్కాలిక ఉపశమనం కోసం అనేకమంది ఇరాన్ పౌరులు సరిహద్దులు దాటి పొరుగు దేశమైన ఇరాక్‌లోకి వెళ్తున్నారు. ముఖ్యంగా దక్షిణ ఇరాక్‌లోని బస్రా సమీపంలో ఉన్న షాలమ్చే సరిహద్దు ద్వారా ఇరానీయులు పెద్ద సంఖ్యలో ప్రవేశిస్తున్నారు. అక్కడ తక్కువ ధరకే లభించే నిత్యావసర సరుకులను కొనుగోలు చేయడంతో పాటు, ఇరాన్‌లో నిలిచిపోయిన ఇంటర్నెట్ సదుపాయం కోసం ఇరాక్ వెళ్తుండటం గమనార్హం. తమ బంధువుల ఇళ్లలో కొన్నాళ్లు గడిపి, తిరిగి అబుదాన్, అహ్వాజ్ వంటి తమ సొంత నగరాలకు చేరుకుంటున్నారు. యుద్ధాన్ని వెంటనే ముగించాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరుతున్నప్పటికీ, తమ మాతృభూమిని మాత్రం విడిచిపెట్టబోమని వారు స్పష్టం చేస్తున్నారు.





## క్షిపణి దాడుల్లో ముగ్గురు జర్నలిస్టులు మృతి

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

దక్షిణ లెబనాన్‌లోని జెజ్జిన్ పట్టణంలో ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడిలో శనివారం విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు జర్నలిస్టులు సజీవ దహనమయ్యారు. మృతుల్లో అల్‌మనార్ టీవీ ప్రతినిధి అలీ షూయబ్, అల్‌మయాదీన్ రిపోర్టర్ ఫాతిమా ఫటౌనీ తో పాటు కెమెరామెన్ మహమ్మద్ ఫటౌనీలు ఉన్నారు. వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఇజ్రాయెల్ క్షిపణి నేరుగా తాకడంతో ఈ దుర్ఘటన సంభవించింది. మరణించిన అలీ షూయబ్ జర్నలిస్ట్ ముసుగులో ఉన్న హిజ్బుల్లా 'రాద్వాన్ ఫోర్స్' ఉగ్రవాదని, గత కొన్నేళ్లుగా ఇజ్రాయెల్ సైనిక కదలికలను శత్రువులకు చేరవేస్తున్నాడని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ సంచలన ఆరోపణలు చేసింది.

...::: తరువాయి 2వ పేజీలో...

## డీఎంకే 'సూపర్ స్టార్' మేనిఫెస్టో గృహిణులకు నజరానా



చెన్నై (ఏడీఎన్ఎన్):

తమిళనాడు శాసనసభ ఎన్నికల వేళ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంచలన హామీలతో కూడిన మేనిఫెస్టోను ఆదివారం విడుదల చేశారు. గతంలో తమ మేనిఫెస్టోను 'హీరో'గా అభివర్ణించిన ఆయన, ఈసారి సంక్షేమ పథకాల తీవ్రతను బట్టి దీనిని 'సూపర్‌స్టార్' మేనిఫెస్టోగా నామకరణం చేశారు.ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, సామాన్యులను లక్ష్యంగా చేసుకుని ఈ హామీలు ఇచ్చారు. ఈ మేనిఫెస్టోలో అత్యంత ఆకర్షణీయమైన అంశం 'ఇల్లత్తరసి' పథకం. ఆదాయపు పన్ను చెల్లించని గృహిణులందరికీ రూ. 8,000 విలువైన ప్రత్యేక కూపన్‌ను అందజేస్తారు. ఈ కూపన్ ఉపయోగించి వాషింగ్ మెషీన్, టీవీ, ఫ్రిజ్, గ్రైండర్ లేదా ఇండక్షన్ స్టవ్ వంటి గృహోపకరణాలను ఉచితంగా పొందవచ్చు లేదా పాత వాటిని మార్చుకోవచ్చు. నగదు ఇస్తే ఖర్చయిపోతుందనే ఉద్దేశంతోనే ఈ వస్తు రూప కూపన్ల విధానాన్ని తెచ్చినట్లు స్టాలిన్ స్పష్టం చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## తమిళ రాజకీయాల్లో దళపతి శంఖారావం

చెన్నై (ఏడీఎన్ఎన్):

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల క్షేత్రంలోకి సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ అధికారికంగా అడుగుపెట్టారు. చెన్నైలో జరిగిన భారీ బహిరంగ సభలో ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం తన పార్టీ అభ్యర్థుల పూర్తి జాబితాను ఆదివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఇది కేవలం ఎన్నికలు మాత్రమే కావని, అవినీతిపై సామాన్యుడు చేసే యుద్ధమని ప్రకటించి రాజకీయ వర్గాల్లో వేడి పుట్టించారు. విజయ్ స్వయంగా రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయబోతున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. చెన్నైలోని పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల నుంచి ఆయన బరిలోకి దిగుతున్నారు. నామినేషన్ పత్రాల్లో తన పేరును 'సి. జోసెఫ్ విజయ్'గా పేర్కొంటానని స్పష్టం చేశారు. 'విజిల్' గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. పార్టీ సీనియర్ నేతలు ఎన్. ఆనంద్, ఆధవ్ అర్జున వంటి వారికి కీలక బాధ్యతలు అప్పగించారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## ఏపీలో ఐఏఎస్ అధికారుల బదిలీలు





అమరావతి (ఏడీఎన్ఎన్):

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో కీలక మార్పులు చేస్తూ పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఆదివారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. పాలనను మరింత వేగవంతం చేసే ఉద్దేశంతో తీసుకున్న ఈ నిర్ణయంలో భాగంగా, పలు జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించడంతో పాటు, మరికొందరికి కీలకమైన కార్పొరేషన్ల బాధ్యతలను అప్పగించింది. ఈ బదిలీల ద్వారా కీలక జిల్లాలైన గుంటూరు, విశాఖపట్నం, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు కొత్త సారథులు వచ్చారు. జిల్లా కలెక్టర్ల నియామకాల్లో భాగంగా, గుంటూరు జిల్లా కలెక్టరుగా సాయికాంత్ వర్మను నియమించారు. అలాగే, విశాఖపట్నం జిల్లా కలెక్టరుగా అభిషిక్త్ కిశోర్, కాకినాడ జిల్లా కలెక్టరుగా హరేంద్ర ప్రసాద్ బాధ్యతలు చేపట్టనున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టరుగా పని చేస్తున్న టి.నిశాంతిని పదోన్నతిపై అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరుగా నియమిస్తూ, ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అటు కోనసీమ జిల్లా కలెక్టర్ బదిలీ అయిన నేపథ్యంలో, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆ జిల్లా జాయింట్ కలెక్టరే, కలెక్టర్ గా బాధ్యతలను అదనంగా నిర్వహిస్తారని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ల మార్పులతో పాటు పలు కీలక ప్రభుత్వ విభాగాల్లో కూడా బదిలీలు జరిగాయి.

...::: తరువాయి 2వ పేజీలో...

## యూఎస్ స్థావరాలపై ఆత్మాహుతి దాడులు



...::: పూర్తి కథనం 3వ పేజీలో...

## బెంగాల్ బరిలో కాంగ్రెస్

### 284 మంది అభ్యర్థులతో జాబితా విడుదల

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ భారీ కసరత్తు తర్వాత 284 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను ఆదివారం విడుదల చేసింది. ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సమక్షంలో జరిగిన సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో ఈ పేర్లను ఖరారు చేశారు. ప్రధానంగా సీనియర్ నేత, మాజీ విపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి బహ్రాంపుర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తుండటం గమనార్హం. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న భవానీపూర్ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రదీప్ ప్రసాద్‌ను బరిలోకి దించారు. ఇటీవలే పార్టీలో




చేరిన మాజీ ఎంపీ మౌసమ్ నూర్ మాలతీపూర్ నుంచి పోటీ పడుతుండగా, డార్జిలింగ్ నుంచి మాధవ్ రాయ్, డైమండ్ హార్బర్ నుంచి గౌతమ్ భట్టారాయ్ వంటి ముఖ్య నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అసాంసోల్ ఉత్తర, దక్షిణ స్థానాలకు ప్రసేన్‌జిత్ పుయితాండి, సౌవిక్ ముఖర్జీలను అభ్యర్థులుగా ప్రకటించారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతలుగా ఏప్రిల్ 23, 29 తేదీల్లో జరగనున్నాయి. మే 4వ తేదీన ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో, కాంగ్రెస్ తన అభ్యర్థుల ఎంపికలో అనుభవజ్ఞులకు, కొత్తగా చేరిన కీలక నేతలకు ప్రాధాన్యమిచ్చింది. ఈ సమావేశంలో పార్టీ అగ్రనాయకత్వంతో పాటు బెంగాల్ ఏఐసీసీ ఇన్‌ఛార్జి గులాం అహ్మద్ మీర్, ఇతర సభ్యులు పాల్గొని వ్యూహాత్మకంగా అభ్యర్థులను ఖరారు చేశారు.




## గల్ఫ్ దాటిన భారత చమురు నౌకలు

...::: పూర్తి కథనం 3వ పేజీలో...



## భూదందాపై హౌస్ కమిటీ వేస్తాం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ పరిధిలో జరిగిన భారీ భూ అక్రమాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ వేదికగా ఆదివారం ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తమ్ముడు మహేశ్ రావు ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని వందల ఎకరాల భూమిని కబ్జా చేశారని సీఎం వెల్లడించారు. ఈ అక్రమ వ్యవహారంలో తన సోదరుడికి సహకరించాలని హరీశ్ రావు స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వేడుకున్నారని సభలో పేర్కొన్నారు. ఇందుకు మంత్రి నిరాకరించడంతోనే కక్షగట్టిన హరీశ్ రావు, ప్రస్తుతం పొంగులేటిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. ఈ భూ కబ్జాలపై సమగ్ర విచారణ జరిపేందుకు తమ ప్రభుత్వం హౌస్ కమిటీ వేయడానికి సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, అమిత్ షా గతంలో పదే పదే చెప్పారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## మేము సిద్ధం.. మీరు సిద్ధమేనా?

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. తన తమ్ముడు, బావమరిదిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో విచారణకు తాను సిద్ధమని ప్రకటించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి తమ్ముడు, బావమరిదిపై ఉన్న ఆరోపణలపైనా హైకోర్టు జడ్జితో విచారణ చేయించే ధైర్యం రేవంత్‌కు ఉందా? అని సవాల్ విసిరారు. హౌసింగ్ కమిటీ లేదా సీబీసీఐడీ కాకుండా నిష్పక్షపాతంగా న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటిని కాపాడేందుకు రేవంత్ రెడ్డి వంద అబద్ధాలు ఆడి అడ్డంగా దొరికిపోయారని ఆయన ఎద్దేవా చేశారు. పొంగులేటి కంపెనీ అవినీతికి పాల్పడిందని అసెంబ్లీ సాక్షిగా అందరికీ అర్థమైందని హరీశ్ రావు విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రి మధ్య భూముల పంపకాల లావాదేవీలు ఉన్నాయని ఆరోపించారు. సభా సంఘం వేస్తే అసలు విషయాలన్నీ బయటకు వస్తాయనే భయంతోనే ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని మండిపడ్డారు. కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి, బేరాలు కుదిరిన తర్వాతే వాటిని తొలగిస్తున్నారని ఆరోపించారు.



మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
30.03.2026
www.manasarkar.com




# తల్లిదండ్రులకు రక్షణగా కాంగ్రెస్ సర్కార్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తల్లిదండ్రుల హక్కులను కాపాడాలనే సంకల్పంతో 'తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీతనం, పర్యవేక్షణ బిల్లు 2026'ను అసెంబ్లీ ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, భక్తితో కాకపోయినా కనీసం చట్టం అనే భయంతోనైనా వృద్ధులను చూసుకోవాలనేదే తమ ప్రభుత్వ ఆశయమని స్పష్టం చేశారు. వేల కోట్ల సామ్రాజ్యాన్ని నిర్మించి చివరకు కొడుకు చేతిలో మోసపోయిన రేమండ్స్ మాజీ అధినేత విజయ్ పథ్ సింఘానియా ఉదంతాన్ని సీఎం గుర్తు చేశారు. ఆస్తి చేతికి రాగానే తండ్రిని బయటకు పంపేసిన గౌతమ్ సింఘానియా వంటి వారి తీరు ఆధునిక సమాజపు చీకటి కోణమని ఆవేదన వ్యక్తం చేశారు.శ్రవణ కుమారుడిని ఆదర్శంగా తీసుకుని తల్లిదండ్రులను సేవిస్తే ఇలాంటి చట్టాల అవసరమే ఉండదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మనిషి పేగు బంధాలను విస్మరించి కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం పాకులాడటం ఈ సమాజానికి క్షేమకరం కాదని హెచ్చరించారు. కన్నవారిని నిర్లక్ష్యం చేసే బిడ్డలను సమాజం బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఎంతో బాధ్యతతో, భావోద్వేగంతో రూపొందించిన ఈ బిల్లు ద్వారా వృద్ధులకు భరోసా లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**తల్లిదండ్రులను చూడకుంటే జీతంలో కోత**

ఎవరైనా ఉద్యోగి తన తల్లిదండ్రులను పట్టించుకోకుండా వారి కనీస అవసరాలను విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ చట్టం ద్వారా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని నిర్ణయించింది.బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే ఉద్యోగుల మొత్తం జీతం లో 15 శాతం లేదా రూ. 10,000 కట్ చేస్తారు. ఈ మొత్తాన్ని నేరుగా బాధితులైన తల్లిదండ్రుల ఖాతాలో జమ చేస్తారు. ఈ నిబంధన కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలు, గ్రాంట్ ఇన్ఎయిడ్ సంస్థలు, ప్రైవేటు రంగ ఉద్యోగులకు కూడా వర్తిస్తుంది. అంతేకాకుండా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సర్పంచ్‌లు వంటి ప్రజాప్రతినిధులు కూడా ఈ చట్టం పరిధిలోకి వస్తారు. నిరాదరణకు గురవుతున్న తల్లిదండ్రులు నేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు అందిన 60 రోజుల్లోగా విచారణ పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ జిల్లా స్థాయి అధికారి తీర్పుపై అసంతృప్తి ఉంటే 'వయోవృద్ధుల కమిషన్'లో అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించారు. మారుతున్న జీవనశైలి కారణంగా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్న తరుణంలో వృద్ధులకు రక్షణ కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.తల్లిదండ్రులు భారతీయ కుటుంబ వ్యవస్థలో విడదీయలేని భాగమని ప్రభుత్వం అభిప్రాయపడింది. వారిని గౌరవంగా చూసుకోవడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని స్పష్టం చేసింది. ఈ చట్టం ద్వారా ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెరగడమే కాకుండా సమాజంలో ఒక మంచి మార్పు వస్తుందని ఆశిస్తోంది. వృద్ధాప్యంలో ఒంటరివారవుతున్న తల్లిదండ్రులకు ఈ చట్టం ఒక పెద్ద అండగా నిలుస్తుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. తల్లిదండ్రుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారికి ఈ బిల్లు ఒక గుణపాఠం అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మానవీయ విలువలను కాపాడటంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. వృద్ధుల సంక్షేమం కోసం ఇలాంటి వినూత్న చట్టాన్ని తీసుకురావడం తెలంగాణ రాజకీయాల్లో ఒక మైలురాయిగా నిలుస్తోంది.ఎవరైనా ఉద్యోగి తన తల్లిదండ్రులను పట్టించుకోకుండా వారి కనీస అవసరాలను విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం స్పష్టం చేసింది.




# రూ. 10 కోట్లు వెనక్కిచ్చిన మహిళా రైతు

**చెన్నై (ఏడీఎన్ఎన్):**

రాత్రికి రాత్రే అదృష్టం వరించి కోటీశ్వరులవ్వాలని అందరూ కలలు కంటారు. కానీ, తన ఖాతాలో పొరపాటున పడిన రూ. 10 కోట్ల భారీ మొత్తాన్ని చూసి ఆ మహిళా రైతు ఆశపడలేదు. సరికదా.. ఆ సొమ్ము తనది కాదని తిరిగి ఇచ్చేసి తన నిజాయతీని చాటుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మైన్‌పురి జిల్లాకు చెందిన రీటా అనే సాధారణ మహిళా రైతు బ్యాంక్ ఖాతాలో సాంకేతిక కారణాల వల్ల అకస్మాత్తుగా రూ. 10 కోట్లు జమ అయ్యాయి. సాధారణంగా అంత పెద్ద మొత్తాన్ని చూస్తే ఎవరైనా తడబడటం సహజం, కానీ రీటా మాత్రం ఏమాత్రం తత్తరపాటుకు గురికాకుండా వెంటనే స్పందించారు. ఆ డబ్బు తన కష్టార్జితం కాదని గ్రహించిన ఆమె, వెనువెంటనే బ్యాంకు అధికారులను సంప్రదించి విషయాన్ని వెల్లడించారు. కేవలం అధికారులకు సమాచారం అందించడమే కాకుండా, తన కుటుంబ సభ్యులకు కూడా ఆమె కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు, బ్యాంకులో ఉన్న తమ సొంత డబ్బును కూడా ముట్టుకోవద్దని ఆమె స్పష్టం చేయడం గమనార్హం.

# డీఎంకే 'సూపర్ స్టార్' మేనిఫెస్టో గృహిణులకు నజరానా

**మొదటిపేజీ తరువాయి...**

మహిళా ఓటర్లను ఆకట్టుకునేలా పాత పథకాల్లోనూ భారీ మార్పులు చేశారు. ప్రస్తుతం మహిళా కుటుంబ యజమానులకు అందుతున్న 'కలైజ్ఞర్ మగలిర్ ఉరిమై తొగై' (నెలవారీ గౌరవ వేతనం)ను రూ. 1,000 నుండి ఏకంగా రూ. 2,000కు పెంచుతున్నట్లు ప్రకటించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మంది మహిళల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని డీఎంకే భావిస్తోంది. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రస్తుతం అమలవుతున్న ఉచిత అల్పాహార పథకాన్ని మరింత విస్తరించనున్నారు. ఇప్పటివరకు 1 నుండి 5వ తరగతి వరకు ఉన్న ఈ పథకాన్ని, ఇకపై 8వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులందరికీ వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సామాజిక భద్రతలో భాగంగా పెన్షన్ల పెంపుపై కూడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వృద్ధాప్య పింఛనును రూ. 1,200 నుండి రూ. 2,000కు, అలాగే దివ్యాంగుల పింఛనును రూ. 2,500కు పెంచుతామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఆరోగ్య బీమా పరిమితిని కూడా పెంచి, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి రూ. 5 లక్షలుగా ఉన్న వారికి రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకోనున్నారు. రైతుల కోసం ఉచిత విద్యుత్ మీటర్ల ఏర్పాటును హామీగా ఇచ్చారు. ఈ పథకాలకు నిధుల సమీకరణపై వస్తున్న విమర్శలకు సమాధానమిస్తూ, 2021లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన తమ ట్రాక్ రికార్డే తమకు శ్రీరామరక్ష అని స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. డీఎంకే విసిరిన ఈ 'సంక్షేమ అస్త్రం' ఇప్పుడు తమిళ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

# ఒకే రాష్ట్రం - ఒకే రాజధాని!

**మొదటిపేజీ తరువాయి...**

భవిష్యత్తులో అమరావతిని హైదరాబాద్‌ను మించిన అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ముందుగా మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ జెండాను ఎగురవేసి చంద్రబాబు ఈ వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు. తర్వాత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి చంద్రబాబుతో పాటు మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ తన ప్రస్థానంలో ఎన్నో విజయాలను అందుకోవడమే కాకుండా, అనేక కుట్రలను ,సంక్షోభాలను ఎదుర్కొని అజేయంగా నిలిచిందని కొనియాడారు. గత ఐదేళ్ల కాలంలో ఎదురైన దాడులు, అక్రమ కేసులను తట్టుకుని కార్యకర్తల త్యాగాల వల్లే పార్టీ నిలబడిందని, ఆస్తులు పోగొట్టుకున్నా పసుపు జెండాను వదలని కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని ఆయన స్పష్టం చేశారు. పార్టీ కోసం ప్రాణాలర్పించిన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని, వారి పిల్లల చదువుల కోసం ప్రత్యేకంగా పాఠశాలలను కూడా ఏర్పాటు చేశామని చంద్రబాబు గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన హింసను ప్రస్తావిస్తూ, అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలు రాష్ట్రానికి తీవ్ర నష్టమని హెచ్చరించారు.



సామాన్యులను సైతం చట్టసభలకు పంపిన ఘన చరిత్ర తెలుగుదేశం పార్టీదేనని, డ్వాక్రా సంఘాలు , విద్యుత్ సంస్కరణలు వంటి అంశాల్లో టీడీపీ దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. పార్టీలో సమర్థంగా పనిచేసే కార్యకర్తలకే భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని, వారే ప్రజా ప్రతినిధులుగా ఎదుగుతారని ఆయన కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

**మెడపై కత్తి పెట్టినా వెనక్కి తగ్గలేదు: మంత్రి లోకేశ్**

"మెడపై కత్తి పెట్టి బెదిరించినా మన కార్యకర్తలు వెనక్కి తగ్గలేదు. టీడీపీని అడ్రస్ లేకుండా చేస్తామన్న వారే ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారు," అని మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ. 150 కోట్లు ఖర్చు చేశామని, కష్టపడే ప్రతి ఒక్కరినీ పార్టీ గౌరవిస్తుందని తెలిపారు. మాజీ సీఎం జగన్‌కు 'క్రెడిట్ చోరీ డిజార్డర్' అనే జబ్బు వచ్చిందని, తాము తెస్తున్న కంపెనీలు తనవేనని చెప్పుకుంటున్నారని విమర్శించారు.కార్యక్రమం ముగింపులో పార్టీ కోసం విశేష కృషి చేసిన పలువురు కార్యకర్తలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘనంగా సత్కరించారు.

# మేరా యువ భారత్

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

'ఉక్కు నరాలు.. ఇనుప కండరాలు కలిగిన కొంతమంది యువతను నాకివ్వండి. భారత దేశ రూపు రేఖలనే మార్చేస్తాను' అన్నారు నాడు.. స్వామి వివేకానందుడు. 'మనది.. యువ భారతం. దేశ నిర్మాణంలో యువశక్తిదే అగ్రస్థానం. వేల సంక్షోభాలను.. లక్షలాది సవాళ్లను ధీటుగా ఎదుర్కొందాం. ఇప్పుడు మన సమైక్య భారతానికి కావాలసిన ఏకైక నినాదం.. మేరా యువ భారత్' అన్నారు.. భారత ప్రధాని నరేంద్రుడు. సమున్నత జాతి నిర్మాణానికి ప్రగతి వేదికైన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో క్రీడా స్ఫూర్తి మొదలు.. అంతర్జాతీయ యుద్ధ సంక్షోభాల దాకా.. పలు అంశాలను మోదీ ప్రస్తావించారు.ప్రధాని నరేంద్ర మోదీ తన 132వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా దేశీయ ప్రగతిని కొనియాడుతూనే, అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. క్రీడల్లో యువత సాధిస్తున్న విజయాలు, మహిళా శక్తి ప్రాధాన్యతను ప్రస్తావిస్తూనే.. యుద్ధం కారణంగా తలెత్తుతున్న ఇంధన సంక్షోభం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పుకార్లను నమ్మవద్దని పిలుపునిచ్చారు. జమ్మూ కాశ్మీర్ ప్రస్తుతం క్రీడల హబ్‌గా మారుతోందని ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 'ఖేలో ఇండియా వింటర్ గేమ్స్' ద్వారా గుల్మార్గ్ అంతర్జాతీయ గుర్తింపు పొందిందని, అక్కడి యువత ఫుట్‌బాల్ వంటి క్రీడల పట్ల చూపుతున్న ఆసక్తి ఆ



ప్రాంత భవిష్యత్తును మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుదీర్ఘమైన ఏడు దశాబ్దాల నిరీక్షణ తర్వాత జమ్మూ కాశ్మీర్ క్రికెట్ జట్టు రంజీ ట్రోఫీని కైవసం చేసుకోవడం ఒక అద్భుతమని మోదీ కొనియాడారు. కెప్టెన్ పారస్ డోగ్రా నాయకత్వాన్ని, 60 వికెట్లు తీసిన యువ బౌలర్ ఆకిబ్ నబీ ప్రతిభను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఇది కాశ్మీరీ యువతకు గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్నారు. "ఎవరు ఆడతారో వారే వికసిస్తారు" అనే మంత్రాన్ని ప్రధాని గుర్తు చేశారు. అస్మిత అథ్లెటిక్స్ లీగ్ ద్వారా మహిళా క్రీడాకారులు దూసుకుపోతున్నారని, అలాగే టీ20 ప్రపంచకప్‌లో భారత్ సాధించిన చారిత్రక విజయం దేశమంతటా ఉత్సాహాన్ని నింపిందని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అత్యధిక యువత ఉన్న దేశం భారత్ అని, దేశ నిర్మాణంలో యువశక్తిని భాగస్వామ్యం చేయడంలో 'మేరా యువ భారత్' సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. యువతను సానుకూల దృక్పథంతో దేశాభివృద్ధి వైపు మళ్లించడమే దీని ప్రధాన లక్ష్యమన్నారు.

దేశ వారసత్వాన్ని కాపాడుకోవడానికి 'జ్ఞాన భారతం సర్వే'ను ప్రారంభించినట్లు మోదీ తెలిపారు. పురాతన రాతప్రతుల సమాచారాన్ని సేకరించడానికి ప్రజలు 'జ్ఞాన భారతం యాప్' ద్వారా తమ వద్ద ఉన్న సమాచారాన్ని, ఫోటోలను పంచుకోవాలని పిలుపునిచ్చారు. గత నెల రోజులుగా పొరుగు ప్రాంతాల్లో జరుగుతున్న యుద్ధాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం ఏర్పడుతోందని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న కోటి మంది భారతీయులకు సహకారం అందిస్తున్న ఆయా దేశాల ప్రభుత్వాలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

**వదంతులు నమ్మవద్దు:**

యుద్ధం కారణంగా తలెత్తిన నిత్యావసరాల కొరతను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ప్రధాని విమర్శించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో స్వార్థ రాజకీయాలకు చోటు ఉండకూడదని, ప్రజలు పుకార్లను నమ్మకుండా ప్రభుత్వం ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఎదురైన ఎన్నో సవాళ్లను 140 కోట్ల భారతీయుల ఐక్యతతో ఎలాగైతే అధిగమించామో, ప్రస్తుత గ్లోబల్ సంక్షోభాలను కూడా అలాగే జయిస్తామని మోదీ ధీమా వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్ నిర్మించుకున్న సామర్థ్యం ఈ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడానికి తోడ్పడుతుందని వివరించారు.

# క్షిపణి దాడుల్లో ముగ్గురు జర్నలిస్టులు మృతి

**మొదటిపేజీ తరువాయి....**

ఈ ఆరోపణలను లెబనాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తూ, జర్నలిస్టులనే లక్ష్యంగా జరిగిన అమానవీయ దాడి అని స్పందించింది. యుద్ధ సమయంలో జర్నలిస్టులు సాధారణ పౌరులని, వారిపై దాడులు చేయడం అంతర్జాతీయ మానవీయ చట్టాల ఉల్లంఘన అని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ , ప్రధాని నవాఫ్ సలాం వ్యాఖ్యానించారు. కేవలం మీడియా ప్రతినిధులే కాకుండా, దక్షిణ లెబనాన్‌లో పారామెడికల్ సిబ్బందిపై కూడా ఇజ్రాయెల్ ప్రతాపం చూపింది. శనివారం జరిగిన ఐదు వేర్వేరు దాడుల్లో ఎనిమిది మంది ఆరోగ్య కార్యకర్తలు ప్రాణాలు కోల్పోగా, మరో ఏడుగురు గాయపడ్డారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ టెడ్రోస్ అథానమ్ వెల్లడించారు. జౌటర్ అల్‌షర్కియా, కఫర్ తిబ్నిత్ వంటి ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడం దారుణమని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ మరణం తర్వాత హిజ్బుల్లా , ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇరాన్ వేదికగా ప్రారంభమైన ఈ యుద్ధం లెబనాన్‌కు విస్తరించి సామాన్య పౌరులను, వృత్తి నిపుణులను బలి తీసుకుంటోంది. ఇజ్రాయెల్ తన సరిహద్దు భద్రతే లక్ష్యమని చెబుతున్నప్పటికీ, వరుసగా జర్నలిస్టులు వైద్య సిబ్బంది మరణిస్తుండటం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. ఈ నెల 18న బీరుట్‌లో జరిగిన దాడిలో అల్‌మనార్ న్యూస్ ప్రజెంటర్ మొహమ్మద్ షెరీ దంపతులు మరణించిన ఘటనను కూడా ఈ సందర్భంగా నిపుణులు గుర్తు చేస్తున్నారు.




# ఆఫ్రికన్ ఫుట్‌బాల్ సమాఖ్యలో సంక్షోభం!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఆఫ్రికన్ ఫుట్‌బాల్ సమాఖ్య జనరల్ సెక్రటరీ వెరాన్ మొసెంజోఓంబా తన పదవికి రాజీనామా చేశారు. సెనెగల్ జట్టు నుంచి 'ఆఫ్రికా కప్ ఆఫ్ నేషన్స్' టైటిల్‌ను వెనక్కి తీసుకోవడం , మహిళల టోర్నమెంట్‌ను చివరి నిమిషంలో వాయిదా వేయడం వంటి వివాదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 66 ఏళ్ల ఓంబా, తనపై వచ్చిన ఆరోపణలను పటాపంచలు చేశానని, మనశ్శాంతితో తప్పుకుంటున్నానని ప్రకటించారు. ఆయన స్థానంలో సామ్సన్ ఆడము తాత్కాలిక బాధ్యతలు చేపట్టనున్నారు. మొసెంజోఓంబా పదవీకాలం మొదటి నుంచి విమర్శలకు గురైంది. రిటైర్మెంట్ వయస్సు (63 ఏళ్లు) దాటినా కొనసాగడం, సిబ్బంది పట్ల కఠినంగా వ్యవహరించడం వంటి ఆరోపణలు ఆయనపై వచ్చాయి. మరోవైపు, మొరాకోతో జరిగిన ఫైనల్‌లో గెలిచిన సెనెగల్‌ను కాదని, నిబంధనల ఉల్లంఘన పేరుతో మొరాకోను విజేతగా ప్రకటించడం అంతర్జాతీయంగా చర్చకు దారితీసింది. దీనిపై సెనెగల్ ప్రస్తుతం 'కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్' లో పోరాడుతోంది.


# వైద్యుడి సాహసం



**జబల్‌పూర్: (ఏడీఎన్ఎన్):**

మధ్యప్రదేశ్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో గురువారం అర్ధరాత్రి భారీ ప్రమాదం తప్పింది. ఎన్ఐసీయూ వార్డులో అగ్నిప్రమాదం సంభవించినప్పటికీ, విధుల్లో ఉన్న డాక్టర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి 27 మంది నవజాత శిశువులను కాపాడారు. ఆస్పత్రిలోని వెయిటింగ్ హాల్ ఫ్యాన్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి, దట్టమైన పొగ వార్డు మొత్తం వ్యాపించింది. దీంతో అక్కడున్న తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో అక్కడే ఉన్న డ్యూటీ డాక్టర్ ఏమాత్రం తడబడకుండా వెంటనే అగ్నిమాపక పరికరంతో మంటలను ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం త్రుటిలో తప్పింది. వెంటనే సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. చికిత్స పొందుతున్న 27 మంది శిశువులను తక్షణమే సురక్షితంగా మరో వార్డుకు తరలించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరవింద్ శర్మ తెలిపారు. కాగా ఈ 70 ఏళ్ల నాటి భవనంలో పాత వైరింగ్ కారణంగానే తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# డ్రైవర్ కుమారుడికి ఎమ్మెల్యే సీటు...



**చెన్నై (ఏడీఎన్ఎన్):**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన 'తమిళగ వెట్రి కళగం' అధినేత విజయ్, సామాన్యులకు పెద్దపీట వేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన వద్ద సుదీర్ఘకాలంగా పని చేస్తున్న డ్రైవర్ కుమారుడు రాజశేఖర్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి, వారసత్వ రాజకీయాలకు తావులేదని చాటి చెప్పారు. అభ్యర్థిగా తన పేరు ప్రకటించగానే రాజశేఖర్ వేదికపైనే భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. ఒక సాధారణ డ్రైవర్ కుటుంబం నుంచి వచ్చిన తనకు చట్టసభల్లో పోటీ చేసేంత గొప్ప అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాజశేఖర్‌ను చూసి చలించిపోయిన విజయ్, స్వయంగా ఆయన కన్నీళ్లు తుడిచారు. దగ్గరకు తీసుకుని అతడిని ఓదార్చిన తీరు కార్యకర్తలు, అభిమానులను కదిలించింది. ధనబలం, రాజకీయ నేపథ్యం ఉన్నవారికే టికెట్లు దక్కుతాయనే పాత సంప్రదాయాన్ని బద్దలు కొట్టడమే విజయ్ లక్ష్యమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాల్లోనే కాకుండా నిజ జీవితంలోనూ తాను ప్రజల మనిషినని నిరూపించుకున్నారు. విజయ్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడమే కాకుండా ఇతర ప్రధాన పార్టీలకు ఈ పరిణామం ఓ సవాలుగా నిలిచింది.



# కేరళ అప్పు రూ. 5 లక్షల కోట్లు

**పాలక్కాడ్ (ఏడీఎన్ఎన్):**

కేరళ అప్పు రూ. 5 లక్షల కోట్లు దాటిందని, కేరళలో అధికార మార్పు తథ్యమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలక్కాడ్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. దశాబ్దాలుగా కేరళ స్వార్థ రాజకీయాల మధ్య నలిగిపోతోందన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితులపై విసుగు చెందారని, మార్పు కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములు ఇన్నాళ్లూ ప్రజలను వంచిస్తూ అధికారాన్ని పంచుకున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు సరైన సమయానికి జీతాలు కూడా చెల్లించలేని దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వం చేరుకుందని, ఇది కేవలం ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ వైఫల్యమేనని ఆయన మండిపడ్డారు.

**ఢిల్లీలో దోస్తీ - గల్లీలో కుస్తీ**

జాతీయ స్థాయిలో ఈ రెండు కూటములకు చెందిన పార్టీలు కలిసి పనిచేస్తూ, కేరళలో మాత్రం ఒకరిపై ఒకరు పోరాడుతున్నట్లు నటిస్తున్నాయని మోదీ విమర్శించారు. ఒకరి హయాంలో జరిగిన కుంభకోణాలపై మరొకరు ఎన్నడూ చర్యలు తీసుకోలేదని, దశాబ్దాలుగా కేరళ అభివృద్ధిని వారు పక్కనబెట్టేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలోకి వస్తే అవినీతిపరుల నుంచి నిధులను రికవరీ చేసి, అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుండగా, మే 4వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి.

# భూదందాపై హౌస్ కమిటీ వేస్తాం

**మొదటిపేజీ తరువాయి...**

నిందితులను 48 గంటల్లో జైల్లో పెడతామన్న కిషన్ రెడ్డి మాటలు నమ్మి కేసును సీబీఐకి అప్పగిస్తే ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై దర్యాప్తును ముందుకు సాగనివ్వడం లేదని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను జైలుకు పంపిన తర్వాతే బీజేపీ నేతలు తమకు సూచనలు ఇస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై సీఐడీ విచారణకు ఆదేశించడంతో కేటీఆర్, హరీశ్ రావు మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగిందని సీఎం సంచలన వ్యాఖ్యలు చేశారు. మైనింగ్ శాఖలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే సీబీ సీఐడీ విచారణకు ఆదేశించామని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా కఠిన శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ వ్యవహారంలో హరీశ్ రావు నిజాయితీపరుడని కేటీఆర్ నమ్మితే వెంటనే హౌస్ కమిటీకి అంగీకరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వీరిద్దరి పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైందని సీఎం వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రజా ధనాన్ని దోచుకున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, అక్రమాలను అరికట్టే విషయంలో రాజీ పడబోమని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు.

# అమెరికాకు ఇరాన్ బ్రిగేడియర్ హెచ్చరిక

**మొదటిపేజీ తరువాయి....**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై జొల్ఫకరి వ్యక్తిగత విమర్శలతో విరుచుకుపడ్డారు. ట్రంప్‌ను ప్రపంచంలోనే "అత్యంత అబద్ధాలకోరు అధ్యక్షుడు" అని అభివర్ణిస్తూ, ఆయన నిర్ణయాల్లో ఏమాత్రం స్థిరత్వం లేదని ఎద్దేవా చేశారు. ఒక క్షణం శాంతి చర్చల గురించి మాట్లాడే ట్రంప్, మరుసటి క్షణమే యుద్ధం గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసును ప్రస్తావిస్తూ, ఆ కేసులోని సంబంధాల కారణంగా ట్రంప్ ఇజ్రాయెల్ నిఘా సంస్థ 'మొస్సాద్' ఒత్తిడికి లోనవుతున్నారని, అందుకే ఆయన ఇజ్రాయెల్ ప్రధానికి ఒక "పావు"గా మారారని సంచలన ఆరోపణలు చేశారు. అమెరికా అంతర్గత బలహీనతలే వారిని ఇటువంటి అనవసర యుద్ధాల వైపు నడిపిస్తున్నాయని ఇరాన్ విమర్శించింది. పర్షియన్ గల్ఫ్ లో భూతల కార్యకలాపాల కోసం అమెరికా రక్షణ శాఖ రహస్య ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్న వార్తలు ఇరాన్‌ను ఆగ్రహానికి గురిచేస్తున్నాయి. వ్యూహాత్మకమైన ఖార్గ్ ద్వీపం , హోర్ముజ్ జలసంధి సమీప ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయాలని అమెరికా భావిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఈ దాడులకు ఇంకా అధికారిక ఆమోదం లభించనప్పటికీ, ఇరాన్ మాత్రం తన రక్షణ కవచాన్ని పటిష్టం చేసుకుంటూ సరిహద్దుల్లో భారీగా బలగాలను మోహరిస్తోంది. ఇరాన్ యొక్క ఈ తాజా హెచ్చరికలు అమెరికా సైనిక వ్యూహకర్తలకు సవాలుగా మారాయి.

# తమిళ రాజకీయాల్లో దళపతి శంఖారావం

**మొదటిపేజీ తరువాయి...**

అభ్యర్థుల ఎంపికలో విజయ్ సామాన్యులకే పెద్దపీట వేశారు. తన అభ్యర్థులకు భారీ ఆస్తులు లేదా రాజకీయ అండదండలు లేకపోయినా, ప్రజల కష్టాలు తెలిసిన నిజాయితీపరులని ఆయన పేర్కొన్నారు. అనుభవం కంటే చిత్తశుద్ధి ముఖ్యమని, ప్రతి అభ్యర్థిని స్వయంగా తానే క్షుణ్ణంగా పరిశీలించి ఎంపిక చేశానని వెల్లడించారు. ఇతర పార్టీల నేతల్లా తమ అభ్యర్థులు అవినీతికి పాల్పడబోరని ఆయన భరోసా ఇచ్చారు. తమ పార్టీ మేనిఫెస్టోలోని కీలక అంశాలను వివరించారు. నిరుద్యోగులకు నెలకు రూ.4,000 భృతి, యువత ఉన్నత విద్య కోసం రూ.20 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీలో 75 శాతం స్థానికులకే కేటాయిస్తామని, వాలంటీర్ వ్యవస్థను ప్రవేశపెడతామని ప్రకటించారు. మత్తు పదార్థాల రహిత తమిళనాడును నిర్మించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. మహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని విజయ్ హామీ ఇచ్చారు. సినిమా వాళ్లు రాజకీయాల్లో గెలవలేరన్న విమర్శలకు తన గెలుపుతోనే సమాధానం చెబుతానని విజయ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇది తనకూ, స్టాలిన్ సార్‌కు మధ్య జరుగుతున్న 'ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య యుద్ధం' అని అభివర్ణించారు. ఈ ఎన్నికల ద్వారా తమిళనాడు రాజకీయ ముఖచిత్రాన్ని మారుస్తానని ఆయన శపథం చేశారు.

# ఏపీలో ఐఏఎస్ అధికారుల బదిలీలు

**మొదటిపేజీ తరువాయి....**

కాకినాడ జిల్లా కలెక్టరుగా ఉన్న షణ్మోహన్‌ను ఏపీఈడీబీ సీఈఓగా, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరుగా ఉన్న దినేష్ కుమార్‌ను ఏపీఐఐసీ ఎండీగా నియమించారు. వీరితో పాటు తమీమ్ అన్సారియాను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా నియమిస్తూ జీవో జారీ చేశారు. బదిలీ అయిన అధికారులందరూ తక్షణమే తమకు కేటాయించిన కొత్త బాధ్యతలను చేపట్టాలని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో ఆదేశించింది.



## యూఎస్ స్థావరాలపై ఆత్మాహుతి దాడులు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అగ్రరాజ్యం అమెరికాకు కోలుకోలేని దెబ్బ తగిలింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా దుబాయ్‌లోని రెండు అమెరికా రహస్య స్థావరాలపై ఇరాన్ కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ వినాశకర దాడులు చేసింది. క్షిపణులు , ఆత్మహుతి డ్రోన్లతో జరిగిన ఈ దాడుల్లో అమెరికా స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ దాడుల్లో సుమారు 500 మంది అమెరికా సైనికులు ఉన్న ఆ ప్రాంతాల్లో భారీ ప్రాణనష్టం సంభవించినట్లు ఐఆర్‌జీసీ ఒక ప్రకటన చేసింది. దుబాయ్ వీధుల్లో గాయపడిన సైనికులను తరలించేందుకు అంబులెన్స్ లు గంటల తరబడి పరుగులు తీయడం అక్కడ నెలకొన్న భీభత్సానికి అద్దం పడుతోంది. అమెరికా సైన్యానికి ఇక లొంగిపోవడం తప్ప మరో మార్గం లేదని పేర్కొంది. ఈ దెబ్బతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తమ శక్తి ఏంటో అర్థమై ఉంటుందని ఐఆర్‌జీసీ కమాండర్లు హెచ్చరించారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ గల్ఫ్ దేశాలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. తమ గగనతలాన్ని ఉపయోగించి అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై దాడులు చేయడానికి అనుమతిస్తే, ఆయా దేశాల ఆర్థిక మూలాలను, ఫ్యాక్టరీలను , ఇంధన పరిశ్రమలను లక్ష్యంగా చేసుకుంటామని ఆయన తేల్చి చెప్పారు. గల్ఫ్ ప్రాంతంలో ప్రశాంతత నెలకొనాలంటే అమెరికా కూటమికి సహకరించడం ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ రెబల్స్ కూడా ఈ పోరాటంలో చేరడంతో గల్ఫ్ దేశాల్లోని అమెరికా వ్యూహాత్మక కేంద్రాలకు ముప్పు పెరిగింది.

**ధ్వంసమైన అవాక్స్ విమానం**

అమెరికా గగనతల నిఘా నేత్రం 'ఈ3సెంట్రీ అవాక్స్' విమానాన్ని ఇరాన్ దళాలు ధ్వంసం చేశాయి. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో ఈ అత్యాధునిక విమానం కకావికలమైందని ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'వాల్ స్ట్రీట్ జర్నల్' వెల్లడించింది. సాధారణంగా యుద్ధ విమానాలకు 'కళ్లు, చెవుల' మాదిరిగా పనిచేసే ఈ3సెంట్రీ, గగనతలంలోనే ఒక కమాండ్ సెంటర్ లాంటిది. బోయింగ్ 707 నమూనాలో ప్రత్యేక మార్పులు చేసి రూపొందించిన ఈ విమానం.. శత్రుదేశాల డ్రోన్లు, క్షిపణులు, యుద్ధ విమానాలు ,ట్యాంకర్ విమానాల కదలికలను వందల కిలోమీటర్ల దూరం నుంచే పసిగట్టగలదు.

## 'ధురంధర్ 2' వసూళ్లపై పాక్ డిమాండ్



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారతీయ చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తూ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఈ సినిమా ఘనవిజయంపై పాకిస్థాన్‌లోని లయరీ ప్రాంత ప్రజల నుంచి ఆసక్తికరమైన డిమాండ్లు ఎదురయ్యాయి. 'ధురంధర్ 2' కథాంశం తమ ప్రాంత సంస్కృతి, చరిత్ర , నేపథ్యంతో ముడిపడి ఉన్నందున, ఈ సినిమా సాధించిన వసూళ్లలో 70 నుంచి 80 శాతం (సుమారు రూ. 500 కోట్లు) తమకు వాటా ఇవ్వాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు. తమ ప్రాంత ప్రాముఖ్యతను సినిమా ద్వారా ప్రపంచానికి చాటిచెప్పినందుకు కృతజ్ఞతలు తెలుపుతూనే, ఆ ఆదాయాన్ని లయరీ ప్రాంత అభివృద్ధికి ఖర్చు చేయాలని దర్శకుడు ఆదిత్య ధర్ , చిత్ర నిర్మాతలను కోరుతున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ డిమాండ్లు నెటిజన్లను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఒక భారతీయ సినిమా వసూళ్లపై పొరుగు దేశ ప్రజలు ఈ స్థాయిలో స్పందించడం సినిమా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మొత్తానికి 'ధురంధర్ 2' వెండితెరపైనే కాకుండా, సరిహద్దుల అవతల కూడా ప్రకంపనలు సృష్టిస్తోంది.రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో దేశభక్తి నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలై కేవలం పది రోజుల్లోనే రూ. 1200 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి భారతీయ సినిమా సత్తాను చాటుతోంది. ఉత్తర అమెరికాలో 20 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు సాధించి, తొమ్మిదేళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న 'బాహుబలి 2' రికార్డును సైతం బద్దలు కొట్టడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా ప్రభంజనం కొనసాగుతుండటంతో చిత్ర యూనిట్ హర్షం వ్యక్తం చేస్తోంది.

# ఇరాన్ పై అమెరికా భూతల యుద్ధం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఇరాన్, ఇజ్రాయెల్ వర్సెస్ అమెరికా మధ్య ఘర్షణ గగనతలానికే పరిమితం కాకుండా, భూతల యుద్ధంగా మారింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భూతల దళాల మోహరింపునకు పూర్తిస్థాయి ఆమోదం తెలిపినట్లు పెంటగాన్ వర్గాలు తెలిపాయి. ఇరాన్ నిరంతరం అమెరికా స్థావరాలు, రాయబార కార్యాలయాలపై క్షిపణులు , డ్రోన్లతో విరుచుకుపడుతుండటంతో, అగ్రరాజ్యం తన వ్యూహాన్ని మార్చింది. ఈ భీకర పోరులో భాగంగా 3,500 మందికి పైగా అదనపు పదాతి దళాన్ని మధ్యప్రాచ్యంలో మోహరించింది. ఆపరేషన్ జోన్‌లో ఉన్న 2,500 మంది మెరైన్లకు వీరు తోడవనున్నారు. గత నెల 28న ప్రారంభమైన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ద్వారా ఇప్పటికే 11,000 లక్ష్యాలను అమెరికా ఛేదించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ యుద్ధంలో కొత్త శక్తులు ప్రవేశించడం అమెరికా మెరైన్లు నేరుగా కదనరంగంలోకి దిగడంతో పశ్చిమాసియా అగ్నిగుండంగా మారింది. ఇరాన్ మద్దతు ఉన్న మిలీషియా గ్రూపులు గల్ఫ్ దేశాల్లోని అమెరికన్ ఎయిర్ బేస్‌లను లక్ష్యం



గా చేసుకుంటుండటంతో, సౌదీ అరేబియా నుంచి బహ్రెయిన్ వరకు అన్ని దేశాలు ప్రభావితమవుతున్నాయి. శాంతి చర్చల ఊసే లేకుండా, అత్యాధునిక ఆయుధాలతో రెండు పక్షాలు తలపడుతుండటం వల్ల ఈ యుద్ధం సుదీర్ఘంగా సాగేలా కనిపిస్తోంది. యుద్ధ క్షేత్రంలో అమెరికా పదాతి దళాల రాకతో, పశ్చిమాసియా భౌగోళిక రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. ప్రాణనష్టం పెరుగుతున్నకొద్దీ అంతర్జాతీయ సమాజంలో ఆందోళన వ్యక్తమవుతున్నా, శత్రువును నిర్మూలించే వరకు వెనక్కి తగ్గేది లేదని అగ్రరాజ్యం సంకేతాలు పంపుతోంది. అమెరికా తీసుకున్న ఈ అనూహ్య చర్య పశ్చిమాసియాలో శాంతికి మంగళం పాడేలా కనిపిస్తోంది. జపాన్ నుంచి వచ్చిన అత్యాధునిక మల్టీమోడల్ యుద్ధనౌక యూఎస్ఎస్ ట్రిపోలీ ద్వారా ఈ దళాలు రంగంలోకి దిగాయి. ఈ నౌక ఎఫ్35 స్టెల్త్ జెట్‌లు , ఆస్ప్రేలను ఏకకాలంలో ఆపరేట్ చేయగల సామర్థ్యం కలిగి ఉంది. దీనికి తోడు శాన్ డియాగో నుంచి యూఎస్ఎస్ బాక్సర్‌ను కూడా పెంటగాన్ ఈ ప్రాంతానికి పంపుతోంది. కేవలం వైమానిక దాడులతోనే శత్రువును అణచాలని భావించినప్పటికీ, మారుతున్న పరిస్థితుల దృష్ట్యా గ్రౌండ్ ఆపరేషన్స్ కు అమెరికా సిద్ధమైంది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌పై ఇరాన్ జరిపిన బాలిస్టిక్ క్షిపణి దాడుల్లో 10 మంది అమెరికా సిబ్బంది గాయపడటం ఉద్రిక్తతలను పెంచింది. యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్ రంగంలోకి దిగి, బాబ్ ఎల్‌మండబ్ జలసంధిని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సూయజ్ కాలువ మార్గాన్ని అడ్డుకోవాలనే వారి వ్యూహం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పుగా మారింది.

# బహ్రెయిన్ పై ఐఆర్‌జీసీ డ్రోన్ దాడులు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

బహ్రెయిన్‌లోని ప్రపంచంలోనే అతిపెద్ద అల్యూమినియం స్మెల్టర్లలో ఒకటిగా పేరుగాంచిన అల్యూమినియం బహ్రెయిన్ ఆదివారం ఉదయం ప్లాంట్‌పై జరిగిన డ్రోన్ దాడి పెను సంచలనం సృష్టించింది. ఈ భీకర దాడిలో ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తక్షణమే చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. పేలుడు పదార్థాలతో కూడిన డ్రోన్లు ప్లాంట్‌లోని విభాగాలను లక్ష్యంగా చేసుకుని దూసుకురాగా, అప్రమత్తమైన సెక్యూరిటీ సిస్టమ్స్ వల్ల ప్రాణనష్టం తగ్గింది. భద్రతా కారణాల దృష్ట్యా ప్లాంట్‌లోని కొంత భాగాన్ని తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చింది. ప్రపంచవ్యాప్త అల్యూమినియం సరఫరా గొలుసుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమాసియా పరిస్థితులు గల్ఫ్ దేశాల ఆర్థిక మూలాలను దెబ్బతీసే స్థాయికి చేరుకున్నాయి. ఈ వినాశకర దాడికి




తామే బాధ్యులమని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ అధికారికంగా ప్రకటించింది. బహ్రెయిన్ ప్రభుత్వం అమెరికా ,ఇజ్రాయెల్ దళాలకు వ్యూహాత్మక మద్దతు ఇస్తున్నందున, దానికి నిరసనగానే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికాఇజ్రాయెల్ కూటమికి సహకరించే ఏ దేశానికైనా ఇవే పరిణామాలు ఎదురవుతాయని ఐఆర్‌జీసీ హెచ్చరించడం గమనార్హం. పశ్చిమాసియాలో అమెరికన్ ఎయిర్ బేస్‌లు, రాయబార కార్యాలయాలపై ఇప్పటికే దాడులు జరుగుతుండగా, ఆర్థికంగా పారిశ్రామిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడం ఇరాన్ యుద్ధ తంత్రంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు.బహ్రెయిన్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ దాడిని తీవ్రంగా ఖండించింది. ఇది దేశ సార్వభౌమత్వానికి ,ఆర్థిక భద్రతకు వాటిల్లిన ముప్పుగా అభివర్ణించింది. దేశంలోని అన్ని మౌలిక సదుపాయాల వద్ద భద్రతను అత్యున్నత స్థాయికి పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. గత కొద్ది రోజులుగా ఇరాన్‌గల్ఫ్ దేశాల మధ్య దాడులు , ప్రతిదాడులు తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్ తన అనుబంధ సంస్థల ద్వారా గల్ఫ్ దేశాల ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోంది. ఈ తాజా పరిణామంతో పశ్చిమాసియాలో యుద్ధం కేవలం సైనిక క్షేత్రాలకే పరిమితం కాకుండా, గ్లోబల్ ట్రేడ్ , పారిశ్రామిక రంగాలకు కూడా విస్తరించిందని స్పష్టమవుతోంది. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే ప్రపంచ మార్కెట్లో లోహాల ధరలు పెరిగి తీవ్ర ఆర్థిక సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉంది.

# కుర్దిస్థాన్ అధ్యక్షుడి ఇంటిపై దాడి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం పొరుగు దేశాలకు వేగంగా విస్తరిస్తూ, మూడవ ప్రపంచ యుద్ధపోరుగా మారుతోంది. ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతీయ అధ్యక్షుడు నెచిర్వాన్ బార్జానీ నివాసమే లక్ష్యంగా జరిగిన డ్రోన్ దాడి ఇప్పుడు కలకలం రేపుతోంది. ఈ దాడిలో ఆయన ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నప్పటికీ, ఈ ఘటన ప్రాంతీయ భద్రతపై ఆందోళనలను రేకెత్తించింది. కుర్దిస్థాన్ ప్రాంతీయ ప్రధానమంత్రి మస్రూర్ బర్జానీ ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ, దీనిని ఒక "పిరికిపంద చర్య"గా అభివర్ణించారు. తమ పౌరుల భద్రతను, ప్రయోజనాలను కాపాడుకోవడానికి అంతర్జాతీయ సమాజం తక్షణమే స్పందించి మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దాడులకు పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



చేస్తూనే, తమ ప్రాంతాన్ని రక్షించుకోవడానికి అవసరమైన ఏ చర్యకైనా వెనకాడబోమని, తిప్పికొట్టే హక్కు తమకుందని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడి వెనుక ఉన్న సూత్రధారులపై స్పష్టత లేనప్పటికీ, అమెరికా , ఇరాన్ దేశాల మధ్య ఆరోపణల పర్వం మొదలైంది. ఇరాన్ మద్దతు ఉన్న మిలీషియా గ్రూపులే ఈ డ్రోన్ దాడికి పాల్పడి ఉంటాయని అమెరికా అనుమానం వ్యక్తం చేయగా, ఇరాన్ మాత్రం దీనిని పూర్తిగా తిప్పికొట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగానే ఈ హత్యాయత్నానికి పాల్పడ్డాయని ఇరాన్ ఎదురుదాడికి దిగింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ప్స్ ఈ ఘటనను తీవ్రమైన ఉగ్రవాద చర్యగా పేర్కొంటూ, తమ ప్రాంతీయ భాగస్వాములను రక్షించుకోవడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. అగ్రరాజ్యాల మధ్య సాగుతున్న ఈ ప్రచ్ఛన్న యుద్ధం పరస్పర దాడులు పశ్చిమాసియాను అస్థిరతలోకి నెట్టివేస్తున్నాయి. ఒకవేళ ఈ ఉద్రిక్తతలు గనుక అదుపు తప్పితే, భారీ ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ , ప్రాంతీయ శాంతి కోసం ప్రపంచ దేశాలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

# గల్ఫ్ దాటిన భారత చమురు నౌకలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతవరణంలో గల్ఫ్ ప్రాంతం నుంచి భారత ఇంధన అవసరాలకుగానూ రెండు భారీ ఎల్పీజీ క్యారియర్లు సురక్షితంగా బయటకు దాటాయి. బీడబ్ల్యూ టీవైఆర్ , బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ అనే రెండు నౌకల్లో సుమారు 94,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ నిల్వలు ఉన్నాయి. కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ జలమార్గాల మంత్రిత్వ శాఖ ప్రకారం, బీడబ్ల్యూ టీవైఆర్ నౌక ఈ నెల 31 నాటికి ముంబై తీరానికి, బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ నౌక వచ్చే నెల 1న న్యూ మంగళూరుకు చేరుకోనున్నాయి. యుద్ధ మేఘాలు కమ్ముకున్న గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం 18 భారతీయ నౌకలు, సుమారు 485 మంది భారత నావికులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీరి భద్రతను పర్యవేక్షించేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఆధ్వర్యంలో నిరంతర కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. గడిచిన 24 గంటల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, మొత్తం 942 మంది భారత నావికులను యుద్ధ ప్రభావిత ప్రాంతాల నుంచి సురక్షితంగా స్వదేశానికి తరలించినట్లు అధికారులు ప్రక




టించారు. భారత రాయబార కార్యాలయాలు, విదేశాంగ శాఖ , అంతర్జాతీయ సముద్రయాన భాగస్వాములతో కలిసి నావికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధి , గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారత్‌లోని అన్ని ప్రధాన ఓడరేవుల్లో కార్యకలాపాలు ఎక్కడా ఆగిపోకుండా సాధారణంగానే కొనసాగుతున్నాయి. చమురు , గ్యాస్ సరఫరా గొలుసు దెబ్బతినకుండా భారత ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. పశ్చిమాసియాలోని భారతీయుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని, సహాయం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్‌లు నిరంతరం అందుబాటులో ఉంటాయని విదేశాంగ శాఖ భరోసా ఇచ్చింది. యుద్ధం కారణంగా అంతర్జాతీయ నౌకాయాన మార్గాల్లో అస్థిరత నెలకొన్న తరుణంలో, భారత నౌకలు సురక్షితంగా రావడం దేశ ఇంధన భద్రతకు ఎంతో కీలకంగా మారింది.

## ఇంధన క్షిపణిని పరీక్షించిన కిమ్




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అమెరికానే ఏకైక లక్ష్యంగా ఇంధన క్షిపణి ఇంజిన్‌ను ఉత్తర కొరియా విజయవంతంగా పరీక్షించింది. ఈ ప్రయోగాన్ని దేశ అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా పర్యవేక్షించారు. ఉత్తర కొరియా తన అణుదాడి సామర్థ్యాన్ని పెంచుకుంటూ, శక్తిమంతమైన వ్యూహారచన చేస్తోంది. ఈ నూతన ఇంజిన్‌లో అత్యాధునిక కాంపోజిట్ ఫైబర్ మెటీరియల్‌ను వినియోగించారని, 2,500 కిలో టన్నుల థ్రస్ట్ సామర్థ్యాన్ని కలిగి ఉందని అధికారిక మీడియా సంస్థ కేసీఎన్ఏ ఆదివారం వెల్లడించింది. రానున్న ఐదేళ్లలో అమెరికా ప్రధాన భూభాగాన్ని తాకగల ఖండాంతర క్షిపణి సామర్థ్యాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామని కిమ్ ఇటీవలే ప్రకటించిన నేపథ్యంలో ఈ పరీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది. దేశ రక్షణకు బలమైన సైనిక నిరోధక శక్తి అత్యవసరమని కిమ్ అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా సాగిస్తున్న దండయాత్రలను ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. తన ప్రసంగంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే అగ్రరాజ్యంపై విమర్శలు గుప్పించారు. ఈ వరుస క్షిపణి పరీక్షలు పసిఫిక్ ప్రాంతంలో కొత్త భద్రతా సవాళ్లను సృష్టిస్తున్నాయి. ఉత్తర కొరియా సాధిస్తున్న ఈ సాంకేతిక పురోగతి అమెరికా రక్షణ వర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు ఇరాన్ సంక్షోభం ముదురుతుండగా, మరోవైపు కిమ్ జోంగ్ ఉన్ దూకుడు కనిపిస్తోంది.


## టూరిస్ట్ ను ఆదుకున్న నానో బనానా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**





భాషా సమస్యల వల్ల విదేశీ ప్రయాణాల్లో ఎదురయ్యే ఇబ్బందులను కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికత ఎలా సులభతరం చేసిందో ఈ ఘటన ఒక చక్కని నిదర్శనం . జపాన్ పర్యటనకు వెళ్లిన ఒక అమెరికన్ టూరిస్ట్, తాను బస చేసిన హోటల్ గదిలో ఉక్కపోతకు గురయ్యాడు. ఏసీ టెంపరేచర్ మార్చలేక ఇబ్బంది పడ్డాడు. ఏసీ రిమోట్‌పై ఉన్న బటన్లన్నీ జపనీస్ భాషలో ఉండటంతో ఏ బటన్ దేనికో అర్థం కాక సతమతమయ్యాడు. ఆ సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన సదరు పర్యాటకుడు, గూగుల్ ఏఐ మోడల్ నానో బనానా సాయం కోరాడు. జపనీస్ భాషలో ఉన్న ఆ రిమోట్‌ను స్కాన్ చేసి, దానిపై ఉన్న బటన్లను ఇంగ్లీష్‌లోకి అనువదించి ఇవ్వమని అడగ్గా, ఏఐ క్షణాల్లో స్పందించింది. రిమోట్‌లోని టెంపరేచర్ కంట్రోల్, ఫ్యాన్ స్పీడ్, మోడ్ సెట్టింగ్స్ వంటి అన్ని విభాగాలను ఖచ్చితంగా విశ్లేషించి, అర్థమయ్యేలా ఇంగ్లీష్‌లోకి ట్రాన్స్ లేట్ చేసిన రిమోట్ ఫోటోను అందించింది. దీని సాయంతో అతను ఏసీని అడ్జస్ట్ చేసుకుని హాయిగా నిద్రపోయాడు. ఏఐ టూల్స్ సామాన్యుల దైనందిన సమస్యలను ఎంత వేగంగా పరిష్కరిస్తున్నాయో వివరిస్తూ ఆ పర్యాటకుడు సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ప్రస్తుతం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. టెక్నాలజీని సరైన విధంగా వాడుకుంటే ఎలాంటి సమస్యనైనా చిటికెలో పరిష్కరించుకోవచ్చని ఈ ఘటన నిరూపిస్తోంది.

## నిప్పు కణికల జలపాతం... హార్స్ టెయిల్ మాయాజాలం



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రకృతి తన ఒడిలో దాచుకున్న రహస్యాలలో అమెరికాలోని కాలిఫోర్నియాలోని హార్స్ టెయిల్ జలపాతం అత్యంత అద్భుతమైనది. ఈ జలపాతం మాత్రం ఏడాదిలో కొన్ని రోజులు సాక్షాత్తూ నిప్పు కణికలను కురిపిస్తోందా అన్నట్లుగా భ్రమ కలిగిస్తుంది. అందుకే దీనిని ప్రపంచవ్యాప్తంగా 'ఫైర్‌ఫాల్' అని పిలుస్తారు. ప్రతి ఏటా ఫిబ్రవరి చివరి రెండు వారాల్లో సూర్యాస్తమయ సమయంలో ఈ అద్భుత వింత చోటుచేసుకుంటుంది. సూర్యకిరణాలు ఒక నిర్దిష్ట కోణంలో నీటి ధారలపై పడినప్పుడు, ఆ తెల్లని జలపాతం ఒక్కసారిగా బంగారు ,ఎర్రటి లావా వర్ణంలోకి మారిపోతుంది. ఇది పూర్తిగా కాంతి పరావర్తనం వల్ల కలిగే దృశ్య భ్రమ మాత్రమే అయినప్పటికీ, ఆకాశం నిర్మలంగా ఉన్నప్పుడు మాత్రమే ఈ అద్భుతం సాధ్యమవుతుంది. కేవలం సాయంత్రం వేళ కొన్ని నిమిషాల పాటు మాత్రమే కనిపించే ఈ అరుదైన దృశ్యాన్ని కెమెరాల్లో బంధించడానికి ప్రపంచం నలుమూలల నుంచి ఫోటోగ్రాఫర్లు క్యూ కడతారు. తాజాగా ఒక ఫోటోగ్రాఫర్ అగ్నిపర్వతం నుంచి లావా ప్రవహిస్తున్నట్లుగా ఉన్న ఈ దృశ్యాన్ని సోషల్ మీడియాలో పంచుకోవడంతో అది వైరల్‌గా మారింది. ప్రకృతి సృష్టించిన ఈ మాయాజాలం నెటిజన్లను కాసేపు మంత్రముగ్ధులను చేస్తూ ఉపశమనాన్ని కలిగిస్తోంది. పర్యాటక ప్రేమికులకు ఇది నిజంగా ఒక అపురూపమైన ప్రకృతి వరం అని చెప్పాలి.



# అడుగుపెడితే బూడిద చేస్తాం...

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అమెరికా దళాలు ఇరాన్ గడ్డపై కాలు మోపితే వారిని బూడిద చేస్తామంటూ ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఒకవైపు శాంతి చర్చలకు సిద్ధమని చెబుతూనే, మరోవైపు రహస్యంగా ఇరాన్ భూభాగంపై భూతల దాడులకు ప్రణాళికలు రచిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తమ సైన్యం అమెరికా బలగాల కోసం సిద్ధంగా ఉందని, కేవలం అమెరికానే కాకుండా వారికి సహకరిస్తున్న మిత్రదేశాలను కూడా తాము లక్ష్యంగా చేసుకుంటామని బాగేర్ గాలిబఫ్ స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం టెహ్రాన్‌పై జరిగిన భారీ బాంబింగ్‌లో పలువురు పౌరులు గాయపడినట్లు ఫార్స్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. మరోవైపు , ఇరాన్ తాత్కాలిక కమాండ్ సెంటర్ ఆయుధ తయారీ కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్ లోని ఖార్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో, 3,500 మంది అమెరికా మెరైన్లు ఆదివారం నాటికి సెంట్రల్ కమాండ్ పరిధిలోకి రానుండటం ఈ ఉద్రిక్తతలకు దారితీసింది. ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధి ఫాతేమ్ మొహజిరానీ మాట్లాడుతూ, తాము యుద్ధాన్ని కోరుకోవడం లేదని, ఈ ఘర్షణల వల్ల తమ దేశమే ఎక్కువగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏవైనా శాంతి చర్చలు జరిగితే, ఇరాన్‌కు జరిగిన నష్టానికి పరిహారం చెల్లించడంతో పాటు, హోర్ముజ్ జలసంధిపై తమ నియంత్రణను గుర్తించాలని , అంతర్జాతీయ ఆంక్షలను తక్షణమే తొలగించాలని ఆమె డిమాండ్ చేశారు. తాము శాంతిని కాంక్షిస్తున్నప్పటికీ, ఆత్మరక్షణ కోసం పోరాడక తప్పడం లేదని ఆమె పేర్కొన్నారు. ఇరాన్‌పై భారీ స్థాయిలో ఆదివారం ఉదయం కూడా దాడులు కొనసాగాయి. ఈ దాడుల్లో పలువురు సామాన్య పౌరులు గాయపడగా, ఇరాన్ యొక్క తాత్కాలిక కమాండ్ సెంటర్లు , ఆయుధ తయారీ కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇరాన్ విద్యుత్ ,చమురు కేంద్రాలపై మరో పది రోజుల వరకు దాడులు చేయబోమని ట్రంప్ ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో దాడులు ఆగకపోవడం గమనార్హం.

# ఖార్గ్ ఐలాండ్ పై అమెరికా జెండా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

హోర్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ ప్రధాన చమురు ఎగుమతి కేంద్రం 'ఖార్గ్ ఐలాండ్' ద్వీపాన్ని తమ సైనిక దళాలు స్వాధీనంలోకి తీసుకున్నట్లు అమెరికా వర్గాలు వెల్లడించాయి. ఈ తరుణంలో ఇరాన్ సైన్యాలపై అమెరికా వైమానిక, నౌకాదళాలు భారీ ఎత్తున దిగాయి. ఈ క్రమంలో ఇరాన్ పై అమెరికా పై చేయి సాధించింది. ఇరాన్‌పై వ్యూహాత్మక దాడులను అగ్రరాజ్యం దళాలు వేగవంతం చేశాయి. ప్రపంచ చమురు రవాణాకు హోర్ముజ్ జలసంధి విషయంలో అమెరికా సాహసోపేతమైన ముందడుగు వేసింది. ఇరాన్ నుంచి సాగే ముడి చమురు ఎగుమతుల్లో 90 శాతం ఈ ద్వీపం నుండే జరుగుతాయని తెలుస్తోంది. అమెరికా దీనిని స్వాధీనం చేసుకోవడం ద్వారా ఇరాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీసినట్లయింది. రాబోయే కొన్ని వారాల పాటు ఇరాన్ భూభాగంలో భారీ ఎత్తున 'గ్రౌండ్ ఆపరేషన్స్' (భూతల యుద్ధం) నిర్వహించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్లాన్ చేస్తున్నారు. దీనికోసం పశ్చిమాసియా ప్రాంతానికి పదివేలతో కూడిన అదనపు దళాలను తరలిస్తున్నారు.ప్రపంచ దేశాలకు చమురు ఎగుమతి చేసే హోర్మోజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ గత కొంతకాలంగా హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. ఆ ప్రయత్నాన్ని అడ్డుకోవడానికి అమెరికా ప్రయత్నిస్తోంది. అక్కడ పట్టు సాధించేందుకు అమెరికా నౌకాదళం గత కొంత కాలంగా నిరంతర దాడులు చేస్తూ వచ్చింది. గత కొన్ని రోజులుగా ఇరాన్ అనుబంధ సంస్థలు గల్ఫ్ దేశాల్లోని చమురు ప్లాంట్లు, అమెరికా స్థావరాలపై దాడులు చేస్తున్నాయి. వీటికి ప్రతిచర్యగా అమెరికా నేరుగా ఇరాన్ భూభాగంపైనే దాడులకు దిగింది. అమెరికా చేపట్టబోయే భూతళ యుద్ధం 'గ్రౌండ్ ఆపరేషన్' నిర్ణయం ఈ ప్రాంతంలో పూర్తిస్థాయి యుద్ధానికి దారితీసేలా ఉందని పలువురు అందోళన వ్యక్తం



చేస్తున్నారు. శాంతి చర్చల కోసం ఐక్యరాజ్యసమితి, ఇతర దేశాలు ప్రయత్నిస్తున్నప్పటికీ, ఉద్రిక్తతలు ఏ మాత్రం తగ్గకపోవడం అన్ని దేశాలను కలవరానికి గురి చేస్తున్నాయి.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
30.03.2026
www.manasarkar.com



# ఆళ్లగడ్డలో 'కేబుల్ వార్'


- అఖిలప్రియ వర్సెస్ ఏవీ సుబ్బారెడ్డి..
- ఏప్రిల్ 1 నుంచి కేబుల్ కనెక్షన్లన్నీ ఫ్రీ!

**ఆళ్లగడ్డ (ఏడీఎన్ఎన్) :**

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ రాజకీయాల్లో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, టీడీపీ సీనియర్ నేత ఏవీ సుబ్బారెడ్డి మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. చాలా కాలంగా వీరి మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరు ఇప్పుడు 'కేబుల్ వార్'కు దారితీసింది. ఆళ్లగడ్డ పట్టణంలోని సిటీ కేబుల్ నెట్‌వర్క్ నియంత్రణ కోసం ఇరు వర్గాల మధ్య తీవ్రమైన పోటీ నెలకొనడంతో స్థానికంగా ఉత్కంఠ వాతావరణం కనిపిస్తోంది. ఏవీ సుబ్బారెడ్డికి చెందిన సిటీ కేబుల్ నెట్‌వర్క్‌ను అఖిలప్రియ వర్గీయులు లాక్కొనే ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగంగానే పట్టణంలోని పలు ప్రాంతాల్లో కేబుల్ వైర్లను కట్ చేశారని సుబ్బారెడ్డి వర్గీయులు ఆరోపిస్తున్నారు. తమ వ్యాపారాన్ని దెబ్బతీసేందుకు ప్రత్యర్థి వర్గం కుట్ర చేస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అఖిలప్రియ వర్గం తీరుపై తీవ్ర నిరసనగా ఉన్న ఏవీ సుబ్బారెడ్డి ఒక సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కేబుల్ నెట్‌వర్క్‌కు సంబంధించి పాత కనెక్షన్లతో పాటు, కొత్తగా తీసుకునే కనెక్షన్లను కూడా పూర్తిగా ఉచితంగా ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ఉచిత కేబుల్ సేవలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. ఆళ్లగడ్డ పట్టణంలో దాదాపు 2000కు పైగా ఏవీ సుబ్బారెడ్డికి సంబంధించిన సిటీ కేబుల్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ఏప్రిల్ ఒకటి నుంచి అన్నీ ఫ్రీ అంటూ ఇప్పటికే పట్టణంలో పత్రాలను (పంప్లెట్స్) పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. అఖిలప్రియపై ఉన్న కోపంతోనే సుబ్బారెడ్డి ఈ విధమైన ప్రతిఘటనకు దిగినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.భూమా కుటుంబానికి, ఏవీ సుబ్బారెడ్డికి మధ్య ఉన్న పాత కక్షలు ఇప్పుడు కేబుల్ వ్యాపారం వరకు పాకడంతో ఆళ్లగడ్డ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. ఉచిత కేబుల్ ప్రకటన ద్వారా ప్రజలను తనవైపు తిప్పుకోవాలని సుబ్బారెడ్డి వ్యూహం పన్నగా, దీనికి అఖిలప్రియ వర్గం ఏ విధంగా సమాధానం ఇస్తుందోనని అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ కేబుల్ వివాదం కాస్తా భౌతిక దాడులకు లేదా శాంతిభద్రతల సమస్యకు దారితీయకుండా పోలీసులు ముందస్తుగా నిఘా ఉంచారు. ఒకే పార్టీకి చెందిన ఈ ఇద్దరు నేతల మధ్య నెలకొన్న ఈ రచ్చ ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## ఎమోషనల్ డైలాగులు వద్దు..
# న్యాయం చేయండి!

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అమరావతి రాజధాని చట్టబద్ధతపై ఆమోదించిన తీర్మానంపై వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఇప్పటి వరకు జరిగిన మేలు ఏమిటని ఆయన ప్రశ్నిస్తూ, సోషల్ మీడియా వేదికగా కూటమి ప్రభుత్వంపై ఆదివారం పలు ప్రశ్నలు సంధించారు. 2015లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన రైతుల పరిస్థితి ఇప్పటికీ అగమ్యగోచరంగానే ఉందని, గడిచిన 11 ఏళ్ల కాలంలో రైతులకు కేవలం నామమాత్రపు కౌలు మాత్రమే దక్కిందని విమర్శించారు. భూములిచ్చిన రైతుల్లో ఎవరైనా తమకు కేటాయించిన ప్లాట్‌లో ఇల్లు కట్టుకోగలిగారా, లేదా కనీసం ఒక్క రైతు అయినా కమర్షియల్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించగలిగారా అని ఆయన నిలదీశారు. కేవలం ఎమోషనల్ డైలాగుల వల్ల రైతులకు ఎటువంటి న్యాయం జరగదని విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు. భూములు ఇచ్చిన రైతులకు కేవలం ప్లాట్లు మాత్రమే కాకుండా, 'ఫెయిర్ కాంపెన్సేషన్ చట్టం 2013' ప్రకారం అదనపు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఎసైన్డ్ భూముల విషయంలో అసలైన ఎసైనీలకే నష్టపరిహారం అందేలా చూడాలని సూచించారు. మాటల కంటే చేతల్లో రైతులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు.అదేవిధంగా, గత ప్రభుత్వం రాజధాని పరిధిలో నిరుపేదలకు కేటాయించిన 50 వేల ఇళ్ల పట్టాలను కూటమి ప్రభుత్వం ఎందుకు రద్దు చేసిందని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. ఆ ప్లాట్లను వెంటనే నిరుపేదలకు తిరిగి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లక్షల కోట్లతో రాజధానిని నిర్మిస్తున్న ప్రభుత్వం, భూములిచ్చిన రైతులకు , పేదలకు సంతృప్తిని కలిగించలేకపోతోందని విమర్శించారు. భారీ భవనాల పునాదులు ఎవరి భూముల్లో నిర్మిస్తున్నారో, వారికే సంతోషం లేనప్పుడు ఆ రాజధాని వల్ల కేవలం ధనికులకే, బూర్జువాలకే లాభం కలుగుతుందని, దీనిపై ప్రజలు కూడా ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన హెచ్చరించారు.

## లాడ్జిలో డాక్టర్ కుటుంబం
# ఆత్మహత్యాయత్నం..

- తల్లి, ఐదేళ్ల కూతురు మృతి!

**పల్నాడు (ఏడీఎన్ఎన్) :**



పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఒక ప్రైవేట్ లాడ్జిలో శనివారం రాత్రి జరిగిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. భోపాల్ ఎయిమ్స్‌లో పని చేస్తున్న ఒక డాక్టర్ కుటుంబం సామూహిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, ఈ దుర్ఘటనలో తల్లి , ఐదేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయారు. నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన గోపి భోపాల్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా, ఆయన భార్య శంకర కుమారి అదే ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. వీరికి ఐదేళ్ల మౌనిక ,మూడేళ్ల చిన్నారి మొత్తం ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిన్న రాత్రి భోపాల్ నుంచి నరసరావుపేట చేరుకున్న ఈ కుటుంబం, స్థానిక దినేష్ గ్రాండ్ లాడ్జిలో గది తీసుకున్నారు.చిన్నారితో సహా తల్లి మృతి గదిలోకి వెళ్లిన కొంతసేపటికే వీరు అగాయిత్యానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తల్లి శంకర కుమారి, పెద్ద కుమార్తె మౌనిక (5) అక్కడికక్కడే మృతి చెందారు. భర్త గోపి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో సిబ్బంది వెంటనే గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ప్రస్తుతం గోపిని నరసరావుపేటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. చిన్న కుమార్తె పరిస్థితిపై మరింత సమాచారం అందాల్సి ఉంది.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. దంపతులిద్దరూ వైద్య రంగానికి చెందిన వారు కావడంతో, తాము తెచ్చుకున్న మత్తు ఇంజెక్షన్లను శరీరంలోకి తీసుకోవడం వల్లే ఈ మరణాలు సంభవించి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ దారుణ నిర్ణయానికి కుటుంబ కలహాలు కారణమా లేక ఆర్థిక ఇబ్బందులా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషాద వార్తతో సాతులూరు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# అమిత్ షాతో వెంకయ్యనాయుడు భేటీ..

**పార్లమెంట్‌లో బిల్లుకు రంగం సిద్ధం!**

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆదివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో అమరావతిని ఏపీ ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంట్‌లో చట్ట సవరణ చేసే అంశంపై ప్రధానంగా చర్చించారు.ఏపీ అసెంబ్లీ ఇటీవల ఏకగ్రీవంగా తీర్మానం చేసి పంపిన బిల్లును కేంద్రం తక్షణమే పరిగణనలోకి తీసుకోవాలని వెంకయ్యనాయుడు కోరారు. అమరావతిని ఆంధ్రప్రదేశ్‌కు అధికారిక రాజధానిగా ప్రకటిస్తూ పునర్విభజన చట్టంలో అవసరమైన సవరణలు చేయాలని, రాబోయే పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని ఆయన అమిత్ షాకు విజ్ఞప్తి చేశారు.2015 అక్టోబర్ 22న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా, అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా తన సమక్షంలోనే అమరావతికి శంకుస్థాపన జరిగిన విషయాన్ని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అమరావతి అభివృద్ధి కోసం కేంద్రం అందించిన ఆర్థిక సహాయం, గత ఐదేళ్లలో రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల వల్ల రాజధాని నిర్మాణంలో ఎదురైన ఇబ్బందులను ఆయన హోంమంత్రికి వివరించారు. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి అనిశ్చితి తలెత్తకుండా ఉండాలంటే కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన రక్షణ కల్పించడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు.వెంకయ్యనాయుడు విజ్ఞప్తిపై అమిత్ షా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అమరావతికి సంబంధించిన అన్ని ఫైళ్లు హోం మంత్రిత్వ శాఖ నుంచి క్లియర్ అయ్యాయని, ఇక కేంద్ర క్యాబినెట్ ముందు ప్రవేశపెట్టి ఆమోదముద్ర వేయడం ఒక్కటే మిగిలి ఉందని అమిత్ షా హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇచ్చిన మాట ప్రకారం అమరావతికి పూర్తిస్థాయిలో కేంద్రం అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఈ భేటీతో అమరావతి రాజధాని అంశం తుది దశకు చేరుకుందని, త్వరలోనే పార్లమెంట్ వేదికగా చట్టబద్ధత లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# చంద్రబాబు నాయకత్వం స్ఫూర్తిదాయకం..

**అమరావతి(ఏడీఎన్ఎన్) :**



తెలుగుదేశం పార్టీ (టీడీపీ) 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ ఆ పార్టీ నేతలకు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేసిన ఆయన, టీడీపీ ప్రస్థానాన్ని , నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని కొనియాడారు.విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు గారు 'తెలుగు జాతి ఆత్మగౌరవం' అనే మహోన్నత ఆశయంతో స్థాపించిన ఈ పార్టీ, ఉమ్మడి రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక అద్భుత అధ్యాయాన్ని లిఖించిందని పవన్ స్మరించుకున్నారు. నాలుగు పదుల కాలంగా ప్రజాక్షేత్రంలో అజేయంగా నిలవడంలో టీడీపీ చూపిన పోరాట పటిమ సామాన్యమైనది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ ప్రయాణంలో ఎదురైన ఎన్నో కఠిన సవాళ్లను, సంక్షోభాలను నారా చంద్రబాబు నాయుడు తన సుదీర్ఘ రాజకీయ అనుభవంతో సమర్థవంతంగా అధిగమించారని పవన్ కొనియాడారు. "క్లిష్ట సమయాల్లో చంద్రబాబు గారు ప్రదర్శించిన నాయకత్వ లక్షణాలు కార్యకర్తల్లో కొండంత ధైర్యాన్ని నింపాయి. కేవలం రాజకీయాలే కాకుండా, రాష్ట్ర పురోగతిని, ప్రజల బాగును కాంక్షిస్తూ ఆయన పార్టీని నడిపించిన తీరు స్ఫూర్తిదాయకం," అని ప్రశంసించారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధి పథంలోనూ, ప్రజల పక్షాన నిలబడి పోరాడటంలోనూ చంద్రబాబు తనదైన ముద్ర వేశారని పవన్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు , అభివృద్ధి కేవలం కూటమి ఐక్యతతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ స్నేహాన్ని, సమన్వయాన్ని భవిష్యత్తులోనూ మరింత బలోపేతం చేసుకుంటూ రాష్ట్ర శ్రేయస్సు కోసం కలిసి అడుగులు వేద్దామని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. కూటమిలోని పార్టీల మధ్య ఉన్న ఈ ఐక్యత రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# పల్నాడు,ఆదిలాబాద్‌లో కొత్త విమానాశ్రయాలు..

**న్యూ ఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉడాన్ 2.0 పథకం ద్వారా తెలుగు రాష్ట్రాల విమానయాన రంగానికి భారీ ఊతం లభించనుంది. ఈ పథకం కింద అందుబాటులో ఉన్న ఎయిర్‌స్ట్రిప్‌లను పూర్తిస్థాయి విమానాశ్రయాలుగా అభివృద్ధి చేసే అవకాశం ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. శనివారం రాత్రి ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, ముఖ్యంగా తెలంగాణలోని ఆదిలాబాద్ , ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా నాగార్జునసాగర్‌లలో కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి ఈ స్కీమ్ బాటలు వేయనుందని స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో ప్రస్తుతం రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న ఎయిర్‌స్ట్రిప్‌ను ప్రభావితం చేయకుండా, అదనపు భూసేకరణ ద్వారా కొత్త విమానాశ్రయాన్ని నిర్మిస్తామని, అలాగే వరంగల్ సమీపంలోని మామునూరు విమానాశ్రయానికి జూన్ నెలలో శంకుస్థాపన చేసేందుకు కసరత్తు జరుగుతోందని ఆయన వివరించారు.ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, వచ్చే ఏడాది జూన్ నాటికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు, విస్తరించిన విజయవాడ విమానాశ్రయం కూడా అందుబాటులోకి రానున్నట్లు మంత్రి తెలిపారు. కర్నూలు, కడప విమానాశ్రయాల నుంచి దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఇతర ప్రధాన నగరాలకు విమాన సర్వీసులను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టు రన్‌వే కింద ట్రాఫిక్ టన్నెల్ నిర్మాణానికి కేంద్రం సానుకూలంగా ఉందని, దానికి అయ్యే ఖర్చును తెలంగాణ ప్రభుత్వం భరిస్తే అనుమతులు మంజూరు చేస్తామని వెల్లడించారు. కొత్తగూడెం, బసంత్‌నగర్ విమానాశ్రయాల నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలాలను చూపించాల్సి ఉందని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా విమానయాన రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 28,840 కోట్ల భారీ వ్యయంతో ఈ ఉడాన్ 2.0 పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 100 కొత్త విమానాశ్రయాల అభివృద్ధికి రూ. 12,000 కోట్లు, హెలిపోర్టుల కోసం రూ. 3,500 కోట్లు , విమానయాన సంస్థలకు ప్రోత్సాహకంగా రూ. 10,000 కోట్లు వెచ్చించనున్నారు. 2026 నుండి పదేళ్ల కాలపరిమితితో టైర్ 2, టైర్ 3 పట్టణాలు , పర్యాటక ప్రాంతాలకు కనెక్టివిటీని పెంచడం ద్వారా సామాన్యులకు విమాన ప్రయాణాన్ని చేరువ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అంతేకాకుండా, 2028 నాటికి భారత్‌లో తయారైన తొలి 'మేడ్ ఇన్ ఇండియా' విమానాన్ని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఎంబ్రాయిర్ సంస్థ కీలక నిర్ణయం తీసుకోబోతోందని రామ్మోహన్ నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వైద్యుల నియామకాల్లో కొత్త శకం

- 34 గంటల్లోనే 611 మందికి పోస్టింగ్ ఉత్తర్వులు..
- ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు మంత్రి సత్యకుమార్ శ్రీకారం!

**అమరావతి(ఏడీఎన్ఎన్) :**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ, ప్రజారోగ్య శాఖ ద్వారా ఎంపికైన మెడికల్ ఆఫీసర్ల నియామక ప్రక్రియను అత్యంత పారదర్శక విధానంలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 638 మంది వైద్యుల నియామక ప్రక్రియను కేవలం 34 గంటల్లోనే పూర్తి చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఎంబీబీఎస్ అర్హతతో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పైరవీలకు తావులేకుండా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ఏపీ ఆన్‌లైన్ సహకారంతో నిర్వహించే ఈ ప్రక్రియ సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమై, మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగుతుంది.గతంలో అనుసరించిన జూమ్ కాన్ఫరెన్స్ లేదా ప్రత్యక్ష కౌన్సెలింగ్ కేంద్రాల పద్ధతులకు భిన్నంగా, ఈసారి అభ్యర్థులకు పూర్తి వెసులుబాటు కల్పిస్తూ ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. అభ్యర్థులు తమ ఇంటి నుంచే ఆసుపత్రుల వారీగా ప్రకటించిన పోస్టులన్నింటికీ తమ ప్రాధాన్య క్రమంలో ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చు. ఆప్షన్ల ప్రక్రియ ముగిసిన కేవలం రెండు, మూడు గంటల వ్యవధిలోనే సాఫ్ట్ వేర్ ద్వారా మెరిట్ మరియు ప్రభుత్వ నిబంధనల ప్రాతిపదికన ఆటోమేటిక్‌గా పోస్టింగ్స్ ఖరారవుతాయి. ఎంపికైన అభ్యర్థులు నమోదు చేసిన మెయిల్ ఐడీలకు నేరుగా నియామక ఉత్తర్వులు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఈ కొత్త విధానం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, నిర్వహణలో పారదర్శకత మరింత పెరుగుతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.ఈ నియామకాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లు , బోధనాసుపత్రుల్లో 124 ట్యూటర్ల పోస్టులు కూడా ఉన్నాయి. స్పోర్ట్స్ కోటా మినహా మిగిలిన 611 పోస్టులకు ఈ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్స్ ఇవ్వనున్నారు. అభ్యర్థులు తమకు నచ్చిన ఆసుపత్రులను ఎంపిక చేసుకోవడంలో ఎటువంటి పరిమితులు లేవని, వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇచ్చుకోవడం ఉత్తమమని అధికారులు సూచించారు. పోస్టింగ్ ఉత్తర్వులు పొందిన వైద్యులు 15 రోజుల్లోగా సంబంధిత జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాల్లో లేదా బోధనాసుపత్రుల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. అక్కడే వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుంది. అభ్యర్థుల సౌకర్యార్థం https://aphfwrec.aptonline.in వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచారు.



# మత్స్యకారులకు అన్యాయం జరిగితే సహించం

**నెల్లూరు (ఏడీఎన్ఎన్) :**

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో మత్స్యకారుల హక్కుల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం అండగా ఉంటుందని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వివాదం , మత్స్యకారుల సమస్యలపై కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మత్స్యకారులు తమ ప్రాణాలకు తెగించి పట్టుకున్న నాలుగు తమిళనాడు బోట్లను అధికారులు , కూటమి నాయకులు కుమ్మక్కై దొడ్డిదారిన వదిలేశారని ఆయన ఆరోపించారు. టీడీపీ నాయకులు తొడలు కొట్టడం, అనవసర సవాళ్లు విసరడం ఆపి, అక్రమంగా పంపిన ఆ బోట్లను తిరిగి వెనక్కి తెప్పించి మత్స్యకారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. బోట్ల విడుదల విషయంలో బీఎంఆర్ ప్రమేయం ఉందని ఇస్కపల్లి కాపు తోటయ్యే స్వయంగా వాంగ్మూలం ఇచ్చారని, దీనిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూటమి నేతలపైనే ఉందన్నారు.జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి కష్టార్జితమని, ఈ విషయం జిల్లా ప్రజలకు , మత్స్యకార కుటుంబాలకు బాగా తెలుసని కాకాణి పేర్కొన్నారు. "చంద్రబాబు నాయుడు కేవలం శంకుస్థాపనలు చేస్తారు, పనులు పూర్తయిన తర్వాత రిబ్బన్ కట్ చేసి ఆ క్రెడిట్ తన ఖాతాలో వేసుకుంటారు," అని ఆయన ఎద్దేవా చేశారు. హార్బర్‌లో కొంత భాగాన్ని సాగర్ డిఫెన్స్ వంటి ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడం అత్యంత దుర్మార్గమని, మత్స్యకారులకు కేటాయించిన స్థలాన్ని ప్రభుత్వం అమ్ముకునే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. మత్స్యకారుల సంక్షేమం గురించి మాట్లాడే హక్కు కేవలం వైసీపీకి మాత్రమే ఉందని, వైఎస్ జగన్ గారి హయాంలో వేట నిషేధ భృతిని రూ. 4,000 నుంచి రూ. 10,000కు, డీజిల్ సబ్సిడీని రూ. 6 నుంచి రూ. 9కి పెంచడమే కాకుండా, ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని రూ. 10 లక్షలకు పెంచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.రామాయపట్నం పోర్టు నిర్మాణం, జువ్వలదిన్నెకు ప్రత్యేక రహదారి వంటి మౌలిక సదుపాయాలన్నీ జగన్ మోహన్ రెడ్డి పాలనలోనే సాధ్యమయ్యాయని కాకాణి వివరించారు. కూటమి నాయకులు కేవలం కమిషన్ల కోసమే ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని, నేలటూరు ఫిషింగ్ జెట్టి పనులను సోమిరెడ్డి ఆపివేయడమే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని ఆరోపించారు. మత్స్యకారుల సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏప్రిల్ రెండో వారంలో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించనున్నట్లు ఆయన వెల్లడించారు. మత్స్యకారులకు ఏ రకమైన అన్యాయం జరిగినా ప్రతిపక్ష పార్టీగా తాము చూస్తూ ఊరుకోబోమని, ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని కాకాణి హెచ్చరించారు.




# చంద్రబాబు పాలనలో మంగళవారం 'అప్పుల వారం'


**కాకినాడ (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూటమి ప్రభుత్వ హయాంలో అప్పుల ఊబిలోకి కూరుకుపోతోందని వైసీపీ నేత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాకినాడలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఖరిని ఎండగట్టారు. 2014-19 కాలంలో చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరం అని చెప్పేవారని, కానీ 2024 తర్వాత ప్రతి మంగళవారాన్ని 'అప్పుల వారం'గా మార్చేశారని ఎద్దేవా చేశారు. గత 22 నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వం రికార్డు స్థాయిలో రూ. 3,40,621 కోట్లు అప్పులు తెచ్చి ప్రజల నెత్తిన భారం మోపిందని, ఎక్కడ దొరికితే అక్కడ అప్పులు చేస్తూ "అప్పు చేసి పప్పుకూడు" సామెతను నిజం చేస్తున్నారని దుయ్యబట్టారు.గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమం కోసం అప్పులు చేస్తే రాష్ట్రాన్ని శ్రీలంకతో పోల్చి విషప్రచారం చేశారని కన్నబాబు గుర్తు చేశారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా వైఎస్ జగన్ సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్లారని, కానీ ఐదేళ్ల జగన్ పాలనలో చేసిన అప్పులకు సమానంగా చంద్రబాబు కేవలం 22 నెలల్లోనే చేసేశారని మండిపడ్డారు. మరి ఇప్పుడు రాష్ట్రం శ్రీలంక అవ్వడం లేదా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. చంద్రబాబు అప్పులు చేస్తే 'సంపద సృష్టి' అని, జగన్ మోహన్ రెడ్డి అప్పులు చేస్తే 'రుణ భారం' అని రాసే పత్రికలకు సామాజిక బాధ్యత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెచ్చిన అప్పులు ఏం చేస్తున్నావని చంద్రబాబును అడిగే వారు లేరని, ఆయన తీరు చూసి కాగ్ సైతం ముక్కున వేలు వేసుకుంటుందని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉండి కూడా రాష్ట్రానికి సాధించిన ప్రత్యేక ప్రయోజనాలు ఏమున్నాయని కన్నబాబు నిలదీశారు. గతంలో ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా అప్పులు తేవడాన్ని అడ్డుకున్న చంద్రబాబు, ఇప్పుడు అదే సంస్థ ద్వారా రూ. 17,600 కోట్లు అప్పు ఎలా తెచ్చారని నిలదీశారు. అమరావతిపై అమితమైన ప్రేమ ఒలకబోసే చంద్రబాబు, దాని నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఎంత గ్రాంట్ తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. అటు పోలవరాన్ని పూర్తి చేయలేక, ఇటు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేక రాష్ట్రాన్ని అప్పులతో అధోగతి పాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని "అప్పుల ఆంధ్రప్రదేశ్"గా మారుస్తోందని, ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని కన్నబాబు హెచ్చరించారు.

# గోదావరి తీరంలో పెద్దపులి కలకలం

- పోలవరం నిర్వాసిత గ్రామాల్లో హై అలర్ట్!

**పోలవరం (ఏడీఎన్ఎన్) :**



పోలవరం పరివాహక ప్రాంతంలోని గోదావరి తీరానికి పెద్దపులి చేరడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం పూడిపల్లి సమీపంలో పులి కదలికలను అటవీ అధికారులు తాజాగా గుర్తించడంతో అటవీ శాఖ యంత్రాంగం ఒక్కసారిగా అప్రమత్తమైంది. డీఎఫ్‌వో శివకుమార్, ఎస్‌డీఎఫ్ అనూష ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. పులి ఏ దిశగా ప్రయాణిస్తుందనే అంశంపై ట్రాకింగ్ పరికరాల ద్వారా నిఘా ఉంచుతూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.ఇప్పటికే దేవీపట్నం మండలంలోని పలు నిర్వాసిత గ్రామాలను ప్రజలు ఖాళీ చేసినప్పటికీ, ఇంకా అక్కడ ఉన్న రైతులు , పశువుల కాపరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా పశువుల మందలు ఆరుబయట ఉండటం, రైతులు ఫలసాయం కోసం ఒంటరిగా పొలాల్లోకి వెళ్లడం వంటివి ప్రమాదకరమని సూచించారు. పొలాల్లో ఉన్న పశువుల మందలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు లేదా గ్రామాల్లోకి తరలించాలని విజ్ఞప్తి చేశారు. అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో దప్పు చాటింపు వేయించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.పులి కదలికలు కనిపిస్తే వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించాలని, రాత్రి సమయాల్లో పొలాల్లోకి వెళ్లడం లేదా బయట తిరగడం మానుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఫలసాయం కోసం పొలాలకు వెళ్లే రైతులు కనీసం గుంపులుగా వెళ్లాలని, ఒంటరిగా వెళ్లడం వల్ల ప్రాణాపాయం ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు. పులి సంచారంపై అటవీ శాఖ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ, ప్రజల సహకారం మరియు అప్రమత్తత అత్యవసరమని అధికారులు పేర్కొన్నారు.



# మెట్రో స్వాధీనం పేరుతో వేలకోట్ల భూదందా

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హైదరాబాద్ మెట్రో టేకోవర్ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా తప్పుడు లెక్కలు చెబుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎల్అండ్‌టీ అనే ప్రైవేటు కంపెనీకి ఉన్న రూ. 15 వేల కోట్ల అప్పును తెలంగాణ ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం బలవంతంగా రుద్దుతోందని ధ్వజమెత్తారు. మెట్రోకు కేవలం లీజుకు ఇచ్చిన 280 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎల్అండ్‌టీ వద్ద కొన్నామని చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. గత వైఎస్ఆర్ హయాంలో లీజుకు ఇచ్చిన ప్రభుత్వ భూమిని, తిరిగి మనమే డబ్బులు ఇచ్చి కొనుక్కోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక రూ. 22 వేల కోట్ల విలువైన ఆస్తులను కొట్టేయాలనే 'దండుపాళ్యం ముఠా' కుట్ర దాగి ఉందని సంచలన ఆరోపణలు చేశారు.తన మాట వినడం లేదని ఎల్అండ్‌టీ కంపెనీ సీఎఫ్‌ఓను జైలులో వేస్తామని కాంగ్రెస్ గూండాలు బెదిరింపులకు దిగుతున్నారని కేటీఆర్ విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో ప్రభుత్వం చెబుతున్న అబద్ధాలను బలపరచాలని బ్లాక్‌మెయిలింగ్ చేస్తున్నారని ఆరోపించారు. మెట్రో టేకోవర్‌లో హైదరాబాద్ ప్రజల ప్రయోజనాలు ఏమాత్రం లేవని, కేవలం భూములను కాజేయడమే రేవంత్ రెడ్డి లక్ష్యమని ధ్వజమెత్తారు. ఈ భారీ కుంభకోణంపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని, ప్రజల ఆస్తిని దోచుకుంటే ఊరుకోబోమని స్పష్టం చేశారు.



# ఆ పాపంలో నాకు భాగస్వామ్యం ఉంది

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

బీఆర్ఎస్ హయాంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయినందుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ఆదివారం జరిగిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాధర్నాలో ఆమె పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో తాను కూడా ఉన్నానని, ఆ పాపంలో తనకు భాగస్వామ్యం ఉందని శిరస్సు వంచి క్షమించమని కోరారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండదని కలలుగన్నప్పటికీ అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపించాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.తమ సమస్యలను బీఆర్ఎస్ పట్టించుకోకపోవడం వల్లే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీని గెలిపించారని కవిత గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వీరిని విస్మరించడం దారుణమని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ధర్నాచౌక్ ఎత్తివేస్తే, తాము వచ్చాక అనుమతి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నేడు స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ధ్వజమెత్తారు. ధర్నాలు చేసి చావండి అన్నట్లుగా ప్రభుత్వ వైఖరి ఉందని ఆమె తీవ్రంగా విమర్శించారు.రెండున్నరేళ్లుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పోరాటం చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని కవిత ప్రశ్నించారు. మిలియన్ మార్చ్ తరహాలో హైదరాబాద్ వీధుల్లో భారీ ప్రదర్శన చేసేందుకు ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలా చేస్తేనే ప్రభుత్వం దిగివచ్చి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని సూచించారు. తొమ్మిది ఏజెన్సీలకే ఔట్ సోర్సింగ్ లాభాలు వెళ్తున్నాయని, మధ్యవర్తుల దోపిడీని అరికట్టాల్సిన అవసరం ఉందని ఆమె ఆరోపించారు.ప్రభుత్వానికి రెండు రోజుల గడువు ఇస్తున్నట్లు కవిత ప్రకటించారు. అన్ని శాఖల్లో దళారులు లేకుండా నేరుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు అందేలా జీవోలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ వ్యవస్థలే ఉండకూడదనేది తెలంగాణ జాగృతి లక్ష్యమని స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కుల కోసం తాము అండగా ఉంటామని, పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు.

# నిధుల కోసం మంత్రుల చుట్టూ తిరగాలా?

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత ప్రభుత్వంపై మరోసారి పరోక్షంగా విమర్శలు గుప్పించారు. మీడియాతో ఆదివారం ఆయన మాట్లాడుతూ , నియోజకవర్గాలకు నిధులు విడుదల కావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మంత్రుల నియోజకవర్గాలకు మాత్రమే బిల్లులు వస్తున్నాయని, ప్రభుత్వం అంటే కేవలం మంత్రులు మాత్రమే కాదని గుర్తు చేశారు. తాము నిధుల కోసం మంత్రుల చుట్టూ, ముఖ్యమంత్రి చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం సరికాదని సీరియస్ అయ్యారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని, ప్రభుత్వం ఏ పథకం తెచ్చినా ఆ జిల్లాకే వెళ్తోందనే చర్చ సాగుతోందని హాట్ కామెంట్స్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుంటున్నట్లే, తాము కూడా తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవాలని రాజగోపాల్ రెడ్డి ఆకాంక్షించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మునుగోడు రూపురేఖలు మార్చుకుందామనుకుంటే ఎవరూ సహకరించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లిఫ్ట్‌లన్నింటినీ తన హుజూర్‌నగర్‌కే తరలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తున్నప్పటికీ, నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా మునుగోడు, నకిరేకల్ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రభుత్వ పెద్దలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# గో సంరక్షణలో దేశానికే ఆదర్శం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కేంద్ర మాజీ మంత్రి, జంతు సంరక్షణ ఉద్యమకారిణి మేనకా గాంధీ బృందం ఆదివారం భేటీ అయ్యింది. రాష్ట్రంలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. మున్సిపాలిటీల పరిధిలో వీధికుక్కల సంతానోత్పత్తి నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గోసంరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని, రంగారెడ్డి జిల్లా ఎన్కేపల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ప్రముఖ ఆలయాల



సమీపంలో గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు రేవంత్ రెడ్డి వివరించారు. జంతు సంరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న చొరవపై మేనకా గాంధీ ప్రత్యేకంగా సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కృషితో పాటు అధికారుల పనితీరును ఆమె అభినందించారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జంతువుల పట్ల క్రూరత్వాన్ని అరికట్టేందుకు, పశువుల సంరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై విచారణ జరపాల్సిందే

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్‌పార్క్ వద్ద ఆదివారం భారీ నిరసన చేపట్టారు. కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలో ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ అసెంబ్లీకి కాలినడకన బయలుదేరారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలను తాము ఆధారాలతో సహా బయటపెట్టామని, ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తోందని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రశ్నించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన ఇతర సంస్థలపై చర్యలు తీసుకున్న సర్కార్, ఈ కంపెనీ విషయంలో ఎందుకు మౌనంగా ఉందని నిలదీశారు. తప్పు చేయకపోతే విచారణకు భయమెందుకని, మంత్రుల అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ప్ర




భుత్వం కావాలనే కొన్ని సంస్థలకు కొమ్ముకాస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై గందరగోళం నెలకొనగా, వెల్‌లోకి దూసుకెళ్లి తమ నిరసనను వ్యక్తం చేశారు. కేవలం మంత్రుల ప్రయోజనాల కోసమే విచారణను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పారదర్శకత ఉంటే వెంటనే సభా సంఘాన్ని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా ధనాన్ని దోచుకుంటున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఈ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు.

# సీఎం టార్గెట్ హరీశ్ రావు మాత్రమే

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరూ ఒక్కటేనని ఆయన ఆరోపించారు. వీరిద్దరి మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందని, అందుకే కేటీఆర్‌పై ఉన్న అవినీతి కేసుల విషయంలో ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని దుయ్యబట్టారు.హరీశ్ రావును రాజకీయంగా ఒంటరి చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని బండి సంజయ్ పేర్కొన్నారు. హరీశ్ రావుతో జాగ్రత్తగా ఉండాలంటూ కేటీఆర్‌కు సీఎం సలహాలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్ష కోట్ల రూపాయల అవినీతిని వదిలేసి, కేవలం హరీశ్ రావు బాధ్యత వహించిన ప్యాకేజీలపైనే విచారణ జరుపుతున్నారని విమర్శించారు. కేటీఆర్‌పై ఉన్న డ్రగ్స్, ఫార్ములా రేస్,



ఫామ్‌హౌస్ వంటి కీలక కేసుల గురించి ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్రమైన సీబీఐ విచారణ జరపాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. కేవలం తొమ్మిది వేల కోట్ల రూపాయల మేర జరిగిన అవినీతిపైనే విచారణ కోరడం వెనుక హరీశ్ రావును లక్ష్యం చేయడమే ప్రధాన ఉద్దేశమని ఆరోపించారు. గతంలో తనను జైలుకు పంపిన కేసీఆర్ కుటుంబంపై రేవంత్ రెడ్డికి ఇప్పుడు కోపం పోయిందని, వారి మధ్య సయోధ్య కుదిరిందని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి పోటీ చేసే అవకాశం ఉందని జోస్యం చెప్పారు.బీఆర్ఎస్ పార్టీతో బీజేపీ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని బండి సంజయ్ కుండబద్దలు కొట్టారు. కుటుంబ పాలనను, అవినీతిని అంతం చేయడమే బీజేపీ లక్ష్యమని స్పష్టం చేశారు. రాజకీయ వారసులకు టిక్కెట్లు ఇవ్వబోమని ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం సీఎం రేవంత్ రెడ్డి నిధులు సమకూరుస్తున్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు బీజేపీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తన సరిగా లేదని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. అసలు అసెంబ్లీలో ఎథిక్స్ కమిటీయే లేనప్పుడు, కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని ఆ కమిటీకి ఎలా సిఫార్సు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసి కేవలం ప్రత్యర్థులను భయపెట్టడానికే తూతూ మంత్రపు విచారణలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఇటువంటి కుమ్మక్కు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

# కౌశిక్ రెడ్డిపై ఎథిక్స్ కమిటీ విచారణ

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తన పెను దుమారం రేపింది. సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల కౌశిక్ రెడ్డి చేతితో గన్‌తో కాలుస్తానన్నట్లుగా సైగలు చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ అనాగరిక చర్య అంతా వీడియో కెమెరాల్లో రికార్డయిందని, ఇలాంటి ప్రవర్తనను కేటీఆర్, హరీశ్‌రావు సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. సభలో ఇలాంటి పోకడలను అనుమతిస్తే భవిష్యత్తులో కత్తిపోట్లు కూడా జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కౌశిక్ రెడ్డి అనుచిత ప్రవర్తనపై సుమోటోగా విచారణ చేపట్టి, ఎథిక్స్ కమిటీకి



సిఫార్సు చేయాలని సీఎం డిమాండ్ చేశారు. నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరడంతో, సభ ఇందుకు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేసింది.అంతకుముందు సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఎస్సీల పట్ల రాజకీయ వివక్ష, జాతి కక్ష ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు. "తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా ఎస్సీని చేస్తానని చెప్పి కేసీఆర్ మాట తప్పారు. ఎస్సీలకు పరిపాలన చేతకాదని దొరలే సీఎం కావాలని మాట మార్చారు" అని రేవంత్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్సీ నేతలకు కనీస ప్రాధాన్యత ఇవ్వలేదని, తమ ప్రభుత్వం భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, సీతక్క వంటి నేతలకు ఉన్నత పదవులు ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన స్పీకర్ స్థానంలో ఉండటం ఇష్టం లేకనే బీఆర్ఎస్ నేతలు పోడియం వద్ద నిరసన తెలుపుతున్నారని మండిపడ్డారు. సభకు సహకరించని పక్షంలో తదుపరి సమావేశాల వరకు సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరారు.

# 'ధరణి' అక్రమాలపై హౌస్ కమిటీ వేయాల్సిందే



**హైదరాబాద్(ఏడీఎన్ఎన్) :**

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నేతలు వందలాది ఎకరాల భూములను కబ్జా చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. ఈ భారీ భూ కుంభకోణంపైనే అసలైన హౌస్ కమిటీ వేయాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. పలువురిని బ్లాక్‌మెయిల్ చేసి బలవంతంగా పార్టీలో చేర్చుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. సభలో ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ప్రతిపక్షం రాద్ధాంతం చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం పారదర్శకంగా ఉన్నందునే విచారణలకు ఆదేశిస్తోందని, తప్పుడు ప్రచారాలతో ప్రజలను నమ్మించలేరని స్పష్టం చేశారు. సభ హుందాతనాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలని పట్టుబడుతూ సభా కాలాన్ని వృథా చేయడం సరికాదని ఆయన మండిపడ్డారు. మైనింగ్ అక్రమాలపై ఫిర్యాదు అందిన వెంటనే ప్రభుత్వం స్పందించి సీబీసీఐడీ విచారణకు ఆదేశించిందని గుర్తు చేశారు. సభా సంప్రదాయాల పట్ల అవగాహన ఉన్న కేటీఆర్, హరీశ్‌రావు వంటి నేతలు కూడా హుందాతనాన్ని విస్మరించి దారుణంగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వేసిన మూడు హౌస్ కమిటీల నివేదికలు ఏమయ్యాయో సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా భట్టి ప్రశ్నించారు. ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు.

# డైవర్షన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ కాంగ్రెస్



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అంశంపై సభా సంఘం వేయాలని ప్రతిపక్ష హోదాలో డిమాండ్ చేస్తే, ఆ విషయాన్ని పక్కన పెట్టి ముఖ్యమంత్రి కులాల ప్రస్తావన తీసుకువచ్చారని విమర్శించారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్ ఏ పార్టీ సభ్యులో చెప్పాలని మాత్రమే కౌశిక్ రెడ్డి అడిగారని సమర్థించారు. వారిద్దరూ ప్రస్తుతం ఏ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారో స్పష్టం చేయకుండా వారికి మాట్లాడే అవకాశం ఎలా ఇస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు.ముగ్గురు నలుగురు దళిత నేతలకు పదవులు ఇచ్చినంత మాత్రాన దళితులందరికీ న్యాయం జరిగినట్లు కాదని తలసాని స్పష్టం చేశారు. దళితుల జీవన పరిస్థితులు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలకు దళితులపై నిజంగా అంత గౌరవం ఉంటే, ప్రస్తుతం ఉపముఖ్యమంత్రిగా ఉన్న భట్టి విక్రమార్కను ముఖ్యమంత్రిని చేయాలని సవాల్ విసిరారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం దళిత కార్డును వాడుకోవడం మానుకోవాలని హితవు పలికారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు.



# కడియం శ్రీహరి ఒక 'ఖల్‌నాయక్'

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోసం చేయడం, వెన్నుపోట్లు పొడవడం కడియంకు వెన్నతో పెట్టిన విద్యని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పంచన చేరిన కడియంకు అసెంబ్లీలో మాట్లాడే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. గతంలో కడియం కులం, సామాజికవర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఆయన్ని పొగడ్తలతో ముంచెత్తడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. డబ్బులు, పదవుల కోసం కడియం ఎంతటి దిగజారుడుతనానికైనా దిగుతారని, సిగ్గు ఉంటే బీఆర్ఎస్ సీటులో కూర్చోవాలని పల్లా హితవు పలికారు. కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సంచలన ఆరోపణలు చేశారు. కడియం ఒక 'ఖల్‌నాయక్' అని, తన అనుచరుడు గోరంత బలరాం ద్వారా అంతులేని అవినీతికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. బినామీ పేర్లతో సింగపూర్, మలేసియా వంటి దేశాల్లో కడియం అక్రమ ఆస్తులు కూడబెట్టారని ఆరోపించారు. అసెంబ్లీలో భూకబ్జాల గురించి కడియం మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మ

# అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ శాసనసభలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యక్రమాలను పదేపదే అడ్డుకుంటున్నారనే కారణంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా ఆ పార్టీకి చెందిన 24 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ ప్రసాద్ కుమార్ రెండు రోజుల పాటు సస్పెండ్ చేశారు. మైనింగ్ అక్రమాలపై చర్చకు పట్టుబడుతూ బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలపడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు సస్పెన్షన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, స్పీకర్ దాన్ని ఆమోదించారు. సస్పెండ్ అయిన వారిలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి వంటి ప్రముఖ నేతలు ఉన్నారు. ఈ చర్యతో బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో తన బలమైన గొంతుకను కోల్పోయినట్లయింది . సస్పెన్షన్ పర్వం ఒకవైపు కొనసాగుతుండగా, మరోవైపు కడియం శ్రీహరి విషయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రవర్తన తీవ్ర చర్చనీయాంశమైంది.

# డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో తాగునీటి కష్టాలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



బాచుపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బీజేపీఎంపీ ఈటల రాజేందర్ ఆదివారం సందర్శించారు అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాదాపు 1100 కుటుంబాలు, 5 వేల మంది జనాభా ఉన్న ఈ కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రతి వ్యక్తికి అందాల్సిన 135 లీటర్ల నీరు ప్రస్తుతం అందడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరించేందుకు తన వంతుగా వెంటనే బోర్లు వేయిస్తానని ఈ సందర్భంగా ఎంపీ హామీ ఇచ్చారు. భవనాలపై వాటర్ ప్రూఫింగ్ పనులు చేపట్టాలని, నీటి లీకేజీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కాలనీలో నివసిస్తున్న ప్రజలు తమకు బస్తీ దవాఖాన, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీని కోరారు. ఆర్టీసీ బస్సులు కాలనీ లోపలికి వచ్చేలా చూడాలని, డంపింగ్ యార్డ్ మరియు పార్క్ నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. దీనిపై స్పందించిన ఈటల రాజేందర్.. జనాభా ప్రాతిపదికన ఆశ వర్కర్లను నియమించాలని, అర్బన్ హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. దోమల నివారణకు పక్కనే ఉన్న చెరువును శుభ్రం చేయాలని, శ్మశాన వాటిక మరియు దేవాలయాల నిర్మాణం కూడా అవసరమని పేర్కొన్నారు. కాలనీవాసులందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని పిలుపునిస్తూ, అన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.



# డీలిమిటేషన్ అంటే రేవంత్‌కు భయమెందుకు?

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్) :**

నియోజకవర్గాల పునర్విభజన అంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనవసరంగా జంకుతున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. చట్టసభల్లో స్థానాల పెంపును ఉత్తరాది, దక్షిణాది వివాదంగా వక్రీకరిస్తూ పసలేని వితండవాదం చేస్తున్నారని మండిపడ్డారు. పెరుగుతున్న జనాభా, ప్రజా అవసరాలకు అనుగుణంగానే డీలిమిటేషన్ ప్రక్రియ ఉంటుందని, దీనివల్ల ప్రజలకే మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. మహిళల సాధికారత కోసం 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా ప్రధాని మోదీ అడుగులు వేస్తుంటే, కాంగ్రెస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందన్న ఆరోపణలను లక్ష్మణ్ కొట్టిపారేశారు. గత ప్రభుత్వాల హయాంలో రైల్వే రంగానికి అతి తక్కువ నిధులు కేటాయిస్తే, బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఏకంగా రూ. 7 వేల కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. మూడు హైస్పీడ్ రైళ్లను కూడా హైదరాబాద్‌కు కేటాయించిన విషయాన్ని ప్రస్తావించారు. డీలిమిటేషన్ వల్ల రాష్ట్రానికి ఏ రకంగా అన్యాయం జరుగుతుందో ముఖ్యమంత్రి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. 'ఒకే దేశం ఒకే ఎన్నిక' వంటి సంస్కరణల గురించి మాట్లాడితే భయపడటం ఎందుకని ప్రశ్నించారు. రాజకీయ అవసరాల కోసం కేంద్ర నిర్ణయాలను తప్పుబడితే తెలంగాణ ప్రజలు క్షమించరని లక్ష్మణ్ హెచ్చరించారు.

## రాశి ఫలాలు

**30-03-2026 సోమవారం**

**మేషం:**
అనుకున్న పనులు కొంత నిదానిస్తాయి. శ్రమాధిక్యం. బంధువులు, మిత్రుల నుంచి ఒత్తిళ్లు. ఆలయాలు సందర్శిస్తారు. ఉద్యోగ యత్నాలు కొంత ఫలిస్తాయి. వ్యాపారాలలో చికాకులు. ఉద్యోగాలలో పనిభారం.

**వృషభం:**
కొత్త విషయాలు తెలుస్తాయి. పరిచయాలు పెరుగుతాయి. ఆశయాలు నెరవేరే సమయం. ఆర్థికాభివృద్ధి. కీలక నిర్ణయాలు. ఆధ్యాత్మిక చింతన. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో మంచి గుర్తింపు.

**మిథునం:**
వ్యయప్రయాసలు. బంధువులతో వివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబసభ్యుల సలహాలు స్వీకరిస్తారు. పనుల్లో తొందరపాటు. వ్యాపారాలు సాదాసీదాగా ఉంటాయి. ఉద్యోగాలలో మరింతగా ఒత్తిడులు.

**కర్కాటకం:**
ఇంటాబయటా అనుకూలం. కొత్త వ్యక్తుల పరిచయం. శుభవార్తా శ్రవణం. ఆర్థిక ప్రగతి. వస్తులాభాలు. స్థిరాస్తి వివాదాల పరిష్కారం. పాత మిత్రుల కలయిక. వ్యాపారాలు పుంజుకుంటాయి. ఉద్యోగాలలో కొత్త అవకాశాలు.

**సింహం:**
సన్నిహితులతో మాటపట్టింపులు. ఆధ్యాత్మిక చింతన. దూరప్రయాణాలు. కుటుంబంలో కొద్దిపాటి చికాకులు. ఆరోగ్యభంగం. వ్యాపారాలు నిరాశాజనకంగా ఉంటాయి. ఉద్యోగాలలో మార్పులు ఉండవచ్చు.

**కన్య:**
మిత్రుల సలహాలు స్వీకరిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ఆసక్తికర సమాచారం. విందువినోదాలు. వ్యవహారాలలో విజయం. వ్యాపారాలు కొంత పుంజుకుంటాయి. ఉద్యోగాలలో ఉన్నతస్థితి.

**తుల:**
నూతన ఉద్యోగాలు దక్కుతాయి. ప్రముఖులతో చర్చలు. ఆర్థిక విషయాలలో పురోగతి. కుటుంబసమస్యల నుంచి విముక్తి. సంఘంలో గౌరవం. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో అనుకూల పరిస్థితులు.

**వృశ్చికం:**
మిత్రులతో కలహాలు. రుణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. కుటుంబసభ్యుల నుంచి ఒత్తిడులు. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపార లావాదేవీలు మందగిస్తాయి. ఉద్యోగాలలో ఒడిదుడుకులు.

**ధనస్సు:**
శ్రమ పెరుగుతుంది. పనుల్లో స్వల్ప ఆటంకాలు. అనుకోని ప్రయాణాలు. బంధువులతో మాటపట్టింపులు. ఆలయాలు దర్శిస్తారు. వ్యాపారాలు అంతగా అనుకూలించవు. ఉద్యోగాలలో పనిభారం.

**మకరం:**
కొత్త పనులకు శ్రీకారం. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభం. ఉద్యోగ, విద్యాయత్నాలు ఫలిస్తాయి. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగాలలో అనుకూలత.

**కుంభం:**
మిత్రుల నుంచి శుభవార్తలు. వాహనయోగం. ధన, వస్తులాభాలు. ఆస్తి వివాదాల నుంచి గట్టెక్కుతారు. దైవదర్శనాలు. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు దక్కే అవకాశం.

**మీనం:**
వ్యయప్రయాసలు. బంధుమిత్రుల నుంచి ఒత్తిడులు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. పనులు కొన్ని వాయిదా వేస్తారు. ఆరోగ్యభంగం. వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి. ఉద్యోగాలలో మరిన్ని బాధ్యతలు.



## భార్యతో వివాదం.. అత్తను పొడిచిన అల్లుడు


**నంద్యాల (ఏడీఎన్ఎన్) :**

కుటుంబ కలహాలు విషాదానికి దారితీసిన ఘటన నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం కడమల గ్రామంలో చోటుచేసుకుంది. మద్యం మత్తులో భార్యతో గొడవపడిన వ్యక్తి, అడ్డొచ్చిన అత్తను కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కడమల గ్రామానికి చెందిన సునీల్ అనే వ్యక్తి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి తన భార్యతో గొడవకు దిగాడు. మద్యం మత్తులో ఉన్న సునీల్ ఆవేశంతో భార్యపై దాడి చేయడం ప్రారంభించాడు. ఇది గమనించిన అత్త కళావతి మధ్యవర్తిత్వం చేసేందుకు ముందుకొచ్చి, తన కూతురిని కొట్టవద్దని అల్లుడిని నిలదీసింది. అయితే ఆవేశంలో ఉన్న సునీల్ కత్తితో ఆమెపై దాడి చేశాడు. శరీరంలోని కీలక భాగాల్లో గాయాలు కావడంతో కళావతి అక్కడికక్కడే కుప్పకూలింది. తక్షణం కుటుంబ సభ్యులు, స్థానికులు ఆమెను రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. తీవ్ర గాయాల కారణంగా కళావతి మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఘటన అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## ఎక్కడినుంచైనా పోటీకి సిద్ధం

**పిఠాపురం (ఏడీఎన్ఎన్) :**

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ రానున్న ఎన్నికల నేపథ్యంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశిస్తే, రాష్ట్రంలో ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆదివారం ఆయన ప్రకటించారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పార్టీ నిర్ణయానికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. పార్టీ ప్రయోజనాలే తనకు ముఖ్యమని వర్మ పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు, నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం తన కుటుంబం అంతా కలిసి అంకితభావంతో ప్రచారం చేశామని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా అధిష్టానం ఏ బాధ్యత అప్పగించినా, దానిని చిత్తశుద్ధితో నెరవేరుస్తానని ధీమా వ్యక్తం చేశారు. తనకు పదవి ఉన్నా లేకపోయినా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని వర్మ తెలిపారు. "ప్రజలకు అండగా ఉండటమే నా లక్ష్యం. వారి సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తాను," అని ఆయన వివరించారు. పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ



ముందుకు సాగుతానని, పసుపు జెండా గెలుపే ధ్యేయంగా పనిచేస్తానని పేర్కొన్నారు. వర్మ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పిఠాపురం నియోజకవర్గంతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో ఆయన తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## పుష్కరాల ఏర్పాట్లపై అధికారులకు డెడ్ లైన్

గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో ఆదివారం నిర్వహించిన సమీక్షలో పుష్కరాల ఏర్పాట్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఆలయాలు, ఘాట్ల అభివృద్ధిపై చర్చించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి 1520 రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని టెక్నికల్ ఇంజినీర్ల కమిటీని ఆదేశించారు. 2027 జూన్ నాటికి అన్ని పనులు పూర్తి కావాలని, నివేదికను క్యాబినెట్ సబ్ కమిటీ పరిశీలించిన తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. పుష్కర పనుల పర్యవేక్షణ కోసం ప్రజాభవన్ లో ప్రత్యే



కంగా వార్ రూమ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. బాసర ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ పై సమీక్షించి, ఆలయ విస్తరణకు సంబంధించి అధికారులకు కీలక సూచనలు చేశారు. శాశ్వత, తాత్కాలిక పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల విస్తరణ, రోడ్ల అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి పుష్కరాలను ఒక అవకాశంగా మార్చుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## మహాలక్ష్మి పథకం సరికొత్త రికార్డు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం రాష్ట్ర చరిత్రలో చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం ప్రారంభమైన 28 నెలల కాలంలో మహిళా ప్రయాణికులు పొదుపు చేసిన రవాణా ఛార్జీల మొత్తం రూ. 10,000 కోట్ల మార్కును దాటినట్లు టీ జీ ఎస్ ఆర్ టీసీ అధికారికంగా ప్రకటించింది. 2023 డిసెంబర్ 9 నుంచి నేటి వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయి. గతంలో నెలకు రూ. 1,500 నుంచి రూ. 2,500 వరకు బస్సు ఛార్జీల కోసం వెచ్చించే సామాన్య, మధ్యతరగతి మహిళలు, విద్యార్థినులు ఇప్పుడు ఆ మొత్తాన్ని తమ కుటుంబ అవసరాల కోసం పొదుపు చేసుకుంటున్నారు. ఈ పథకం ద్వారా మహిళా సాధికారతతో పాటు రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రమే మారిపోయిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకాన్ని మరింత సరళతరం చేసేందుకు



టీజీఎస్ ఆర్టీసీ త్వరలో చిప్ ఆధారిత 'స్మార్ట్ కార్డులను' అందుబాటులోకి తీసుకురానుంది. ఈ కార్డులు ఉంటే మహిళలు కండక్టర్లకు ఆధార్ కార్డు చూపించాల్సిన అవసరం లేకుండానే సులభంగా ప్రయాణించవచ్చు. ఖచ్చితమైన గణాంకాల కోసం , రద్దీని త్వరితగతిన క్లియర్ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి వెల్లడించారు. పథకం అమలు తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా 40 శాతం నుంచి 67 శాతానికి పెరిగిందని, ప్రతిరోజూ సగటున 35 లక్షల మంది మహిళలు సురక్షితంగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఈ చారిత్రాత్మక విజయం సాధించినందుకు ఆర్టీసీ సిబ్బందిని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు.

## ప్రజాప్రతినిధుల నట విశ్వరూపం

### దుర్యోధనుడిగా మంత్రి.. కట్టప్పగా ఎమ్మెల్సీ

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

నిత్యం రాజకీయ విమర్శలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే తెలంగాణ ప్రజాప్రతినిధులు రవీంద్రభారతి వేదికగా తమలోని అసలైన కళాకారులను బయటకు తీశారు. శాసనసభ సభ్యుల కోసం ఆదివారం నిర్వహించిన 'స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్'లో మంత్రులు, ఎమ్మెల్యేలు పౌరాణిక పాత్రల నుండి జానపద నృత్యాల వరకు అద్భుత ప్రదర్శనలతో అలరించారు. ఈ వేడుకలో మంత్రి వాకిటి శ్రీహరి దుర్యోధనుడి వేషధారణలో పలికిన గంభీరమైన డైలాగులు సభికులను మంత్రముగ్ధులను చేశాయి. పౌరాణిక నటుడిని తలపించేలా ఆయన చేసిన నటన



ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరోవైపు 'బాహుబలి' కట్టప్ప పాత్రలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఒదిగిపోయి తన నడక తీరుతో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తనదైన శైలిలో గిరిజన సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించి సంస్కృతిని చాటిచెప్పారు. సీనియర్ నటుడు శోభన్ బాబు సూపర్ హిట్ పాటకు రామచంద్ర నాయక్ వేసిన స్టెప్పులు ఈ వేడుకకే హైలైట్‌గా నిలిచాయి. వైరా ఎమ్మెల్యే రామ్‌దాస్ నాయక్ గిరిజన పాటకు హుషారుగా డాన్స్ చేస్తూ అందరిలో ఉత్సాహాన్ని నింపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరూ ఒకే వేదికపై చేరి వినోదాన్ని పంచడం చిరస్మరణీయమైన వేడుకని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. మన నాయకులు కేవలం ప్రసంగాల్లోనే కాదు, నటనలో కూడా దిట్టలేనని నిరూపించారని సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## కుస్తీ జోష్.. జాతరలో ఉత్సాహం

**నిజాంసాగర్ (ఏడీఎన్ఎన్) :**

మహమ్మద్‌నగర్ మండలం నర్వ గ్రామంలో నిర్వహించిన మత్తడి పోచమ్మ జాతర సందర్భంగా కుస్తీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలు ప్రాచీన సాంప్రదాయాలకు పునరుజ్జీవం పోసి, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తున్నాయని గ్రామ సర్పంచ్ గొట్టం అనుసూజ నర్సింహులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు చుట్టుపక్కల మండలాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా మల్లయోధులు తరలివచ్చారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు విభిన్న వర్గాల్లో పోటీలు నిర్వహించగా, ప్రేక్షకులు ఉత్సాహంగా వీక్షించారు. పది రూపాయలతో ప్రారంభమైన ఈ పోటీలు రూ.500 వరకు నిర్వహించబడగా, చివరి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నర్వ గ్రామానికి చెందిన స్వర్గీయ ముప్పిడి రాములు గుప్తా జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాంప్రసాద్ ఐదు తులాల వెండి కడియం బహుమతిగా అందజేశారు. అదనంగా గ్రామస్థులు రూ.2,000 నగదు బహుమతితో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొట్టం అనుసూజ నర్సింహులు, ఉప సర్పంచ్ చింతల దుర్గా నరేష్, గ్రామ పెద్దలు సతీష్ దొర, గొల్ల గోపాల్,



చింతల దుర్గాప్రసాద్, సిరిగిరి గంగారం తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తండ్రి ఒడిలో ప్రాణాలు విడిచిన చిన్నారి

**చిత్తూరు (ఏడీఎన్ఎన్) :**

తిరుమలకు వెళ్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషాద ఘటన బంగారుపాళెం మండలం పాలమాకులపల్లె వద్ద శనివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరులోని సింగసంద్రకు చెందిన దాపు శ్రీధర్‌కుమార్ (46), ఆయన భార్య లక్ష్మి (42), కుమార్తె అద్విక (3) తో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కారులో బయలుదేరారు. ఉదయం సుమారు 6.15 గంటల సమయంలో పాలమాకులపల్లె వద్ద రోడ్డుపై ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వారి కారు ఢీకొని, బస్సు కిందకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శ్రీధర్‌కుమార్, లక్ష్మి, చిన్నారి అద్విక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారు డ్రైవర్ వెంకటేష్ తీవ్రంగా గాయపడగా, అతడిని ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో చిన్నారి అద్విక తండ్రి ఒడిలో కూర్చుని ఉండగా, తండ్రి




ఒడిలోనే ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకంగా మారింది. ఈ దృశ్యం చూసిన స్థానికులు, ప్రయాణికులు తీవ్రం దుఃఖంలో మునిగిపోయారు. ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్ తీవ్రంగా స్థంభించింది. పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళ్లే వాహనాలు సుమారు రెండు గంటల పాటు నిలిచిపోయాయి. అనంతరం పోలీసులు వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను సవ్యంగా పునరుద్ధరించారు. ఇదే ప్రాంతంలో ఇది మూడో ప్రమాదమని స్థానికులు తెలిపారు. సర్వీస్ రోడ్డు బదులు బస్సులను హైవేపై నిలపడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కూడా ఇదే ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో పలువురు గాయపడినట్లు గుర్తుచేశారు.



## వాతావరణ శాఖ అలర్ట్

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొననున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఆదివారం వెల్లడించారు. రాయలసీమ పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమ ,మంగళవారాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ అకాల వర్షాల వల్ల గత కొద్దిరోజులుగా వేధిస్తున్న ఎండ తీవ్రత స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఈ మార్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు, రాష్ట్రంలోని కొన్ని జిల్లాలకు వడగాల్పుల ముప్పు పొంచి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ 'బిగ్ అలర్ట్' ప్రకటించింది. ముఖ్యంగా సోమవారం నాడు విజయనగరం జిల్లాలోని బాడంగి, మెరకముడిదాం, తెర్లాం, వంగర మండలాలు, అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట, గరుగుబిల్లి, జియమ్మవలస, సీతానగరం మండలాల్లో వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించింది. వీటితో పాటు పోలవరం జిల్లాలోని చింతూరు, కూనవరం మండలాల్లో కూడా ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని, మంగళవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా మరో 12 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. విభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు విపత్తుల నిర్వహణ సంస్థ కీలక సూచనలు జారీ చేసింది. ఉరుములతో కూడిన వర్షాలు కురిసే సమయంలో పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున పొలాలు, చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని హెచ్చరించింది. అలాగే వడగాల్పుల తీవ్రత దృష్ట్యా వృద్ధులు, గర్భిణీలు ,పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని కోరింది. వాతావరణ మార్పులపై ఎప్పటికప్పుడు అధికారులు ఇచ్చే హెచ్చరికలను గమనిస్తూ ప్రజలు తగిన జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ విజ్ఞప్తి చేశారు.




## జీజీహెచ్ నుంచి ఖైదీ పరారీ.. ముగ్గురు సస్పెండ్

**గుంటూరు (ఏడీఎన్ఎన్) :**


గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో చికిత్స పొందుతున్న అంతర్రాష్ట్ర నేరస్థుడు అజిత్‌కుమార్ అలియాస్ భీముడు పోలీసుల కళ్లుగప్పి పరారైన ఘటన సంచలనం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నాలుగు రాష్ట్రాల్లో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న అజిత్‌కుమార్‌ను తెనాలి పోలీసులు అరెస్ట్ చేసి రేపల్లె సబ్‌జైలుకు తరలించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్నందున చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు మార్చారు. శనివారం ఆసుపత్రి ప్రాంగణంలోని ఏసీ కాలేజీ గేటు ద్వారా అతడు పరారైనట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఏఆర్ పోలీసులను సస్పెండ్ చేశారు. నిందితుడికి తగిన భద్రత కల్పించడంలో వైఫల్యం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పరారైన నిందితుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. త్వరలోనే అతడిని అదుపులోకి తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.




## ఎలక్ట్రిక్ బస్సులో మంటలు.. తప్పిన ప్రమాదం

**హనుమకొండ (ఏడీఎన్ఎన్) :**

వరంగల్ డిపోకు చెందిన ఓ ఎలక్ట్రిక్ బస్సులో ఆకస్మికంగా మంటలు చెలరేగిన ఘటన కలకలం రేపింది. బస్సులోని బ్యాటరీ విభాగంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే సిబ్బంది సమయోచిత చర్యలతో పెద్ద ప్రమాదం తప్పింది. మాకు తెలిసిన వివరాల ప్రకారం, డిపోలో నిలిపి ఉంచిన ఎలక్ట్రిక్ బస్సులో ఒక్కసారిగా బ్యాటరీలో నుంచి పొగలు రావడంతో పాటు మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అగ్నిమాపక పరికరాల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ఈ విషయంపై డిపో మేనేజర్ రవి స్పందిస్తూ, బస్సులో మొత్తం 12 బ్యాటరీలు ఉంటాయని తెలిపారు. వాటిలో ఒక్క బ్యాటరీలో మాత్రమే లోపం కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నామని చెప్పారు. సిబ్బంది వేగంగా స్పందించడంతో మంటలు మరింత వ్యాపించకుండా అడ్డుకట్ట వేసినట్లు తెలిపారు. ఘటనపై సాంకేతిక నిపుణులతో కలిసి పూర్తిస్థాయి పరిశీలన చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటామని వెల్లడించారు.



## కోహ్లీ సూపర్ ఇన్నింగ్స్.. అనుష్కతో ఫ్లయింగ్ కిస్..

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు విజయం సాధించింది. శనివారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఆర్‌సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ 80 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్‌సీబీ జట్టు, విరాట్ కోహ్లీ అద్భుత ప్రదర్శనతో సులభంగా విజయం సాధించింది. కోహ్లీ 38 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 69 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతనికి తోడుగా దేవదత్ పడిక్కల్ 61 పరుగులతో రాణించడంతో, ఆర్‌సీబీ కేవలం 15.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. మ్యాచ్ ముగిసిన అనంతరం స్టేడియంలో ఆసక్తికర దృశ్యం చోటుచేసుకుంది. గెలుపు ఆనందంలో విరాట్ కోహ్లీ స్టాండ్స్ లో ఉన్న తన భార్య అనుష్క శర్మ వైపు ఫ్లయింగ్ కిస్ పంపగా, ఆమె కూడా స్పందనగా ఫ్లయింగ్ కిస్ ఇచ్చింది. ఈ క్యూట్ క్షణాన్ని ఆర్‌సీబీ మహిళల జట్టు క్రికెటర్లు స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్, శ్రేయాంక పాటిల్ చిరునవ్వులతో ఆస్వాదించారు. స్టేడియం మొత్తం అభిమానుల కేరింతలతో మార్మోగింది.

## ఐటీ కంపెనీలు బెంగళూరు నుంచి తరలింపు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



ఐటీ రంగానికి కేంద్రంగా పేరుగాంచిన బెంగళూరులో పెరుగుతున్న వ్యయాలు, ట్రాఫిక్ సమస్యలు కంపెనీలను ఇతర నగరాల వైపు మళ్లిస్తున్నాయి. గత ఐదేళ్లలో సుమారు 629 సంస్థలు తమ నమోదిత కార్యాలయాలను కర్ణాటక నుంచి ఇతర రాష్ట్రాలకు మార్చినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయితే కంపెనీలు బెంగళూరును పూర్తిగా విడిచిపెట్టడం కాకుండా 'హబ్ అండ్ స్పోక్' విధానాన్ని అనుసరిస్తూ హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాల్లో అదనపు డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయి. బెంగళూరులో అధిక ఆఫీసు అద్దెలు, మౌలిక సదుపాయాలపై ఒత్తిడి, ట్రాఫిక్ సమస్యలు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. విస్తరణలో భాగంగా తక్కువ వ్యయంతో నిపుణులు లభించే నగరాల వైపు కంపెనీలు దృష్టి సారిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ఐటీ సంస్థల తొలి ఎంపికగా నిలుస్తోంది. మెరుగైన మౌలిక వసతులు, ప్రభుత్వ ప్రోత్సాహం, తక్కువ నిర్వహణ వ్యయాలు కంపెనీలను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం నగరంలోని ఐటీ ఎగుమతులు వార్షికంగా రూ.3.6 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇక విశాఖపట్నం కూడా టెక్నాలజీ హబ్‌గా ఎదుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, తక్కువ అద్దెలు, అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాలు కంపెనీలను ఆకర్షిస్తున్నాయి. ప్రముఖ ఐటీ సంస్థలు ఇక్కడ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాయి. అదనంగా పుణె, చెన్నై, కోయంబత్తూర్, కొచ్చి, అహ్మదాబాద్ వంటి నగరాలు కూడా ఐటీ హబ్‌లుగా ఎదుగుతున్నాయి. తక్కువ వ్యయాలు, నిపుణుల లభ్యత కారణంగా ఈ నగరాలు కంపెనీలకు అనుకూలంగా మారుతున్నాయి. ఐటీ రంగం విస్తరణతో దేశంలో బహుళ నగరాలపై ఆధారపడే కొత్త మోడల్ రూపుదిద్దుకుంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




## కొత్త ఫైనాన్షియల్ ఇయర్.. కీలక మార్పులు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

కొత్త ఆర్థిక సంవత్సరం 2026-27 ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏప్రిల్ 1 నుంచి పలు ఆర్థిక, పన్ను, ఉద్యోగ, ప్రయాణ రంగాల్లో కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. కొత్త ఆదాయపు పన్ను చట్టం, లేబర్ కోడ్స్, బడ్జెట్ ప్రతిపాదనలు, రైల్వే నిబంధనల సవరణలతో ఈసారి మార్పుల సంఖ్య ఎక్కువగా ఉండనుంది. కేంద్రం తీసుకొచ్చిన కొత్త ఆదాయపు పన్ను చట్టం, 2025 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. పాత 1961 చట్టానికి బదులుగా సరళమైన విధానంలో రూపొందించిన ఈ చట్టంలో పన్ను శ్లాబుల్లో మాత్రం ఎలాంటి మార్పులు ఉండవు. ఫైనాన్షియల్ ఇయర్, అసెస్‌మెంట్ ఇయర్ స్థానంలో ఇకపై 'ట్యాక్స్ ఇయర్' అనే పదాన్ని వినియోగించనున్నారు. ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ) కింద 50 శాతం పన్ను మినహాయింపు పొందే నగరాల సంఖ్యను నాలుగు నుంచి ఎనిమిదికి పెంచారు. ఇప్పటికే ఉన్న ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నైతో పాటు హైదరాబాద్, పుణె, అహ్మదాబాద్, బెంగళూరు నగరాలను చేర్చారు. అయితే హెచ్‌ఆర్‌ఏ మినహాయింపుల కోసం అద్దె ఒప్పందం, యజమాని వివరాలు, పాన్ సమర్పణ తప్పనిసరి. కొత్త లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే ఉద్యోగుల బేసిక్ జీతం కనీసం మొత్తం సీటీసీలో 50 శాతం ఉండాలి. దీంతో పీఎఫ్, గ్రాట్యుటీ పెరగనున్నప్పటికీ చేతికి వచ్చే జీతం తగ్గే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఫ్యూచర్స్, ఆప్షన్స్ లావాదేవీలపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) పెంపు కూడా అమల్లోకి రానుంది. దీంతో ఎఫ్అండ్ఓ ట్రేడర్లపై అదనపు భారం పడనుంది. పాన్ కార్డు నిబంధనల్లో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్తగా పాన్‌కు దరఖాస్తు చేసుకునే వారు ఆధార్‌తో పాటు ఇతర గుర్తింపు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. అలాగే బ్యాంకు ఖాతాల్లో రూ.10 లక్షలకు మించిన నగదు లావాదేవీలు, రూ.20 లక్షలకు పైబడిన స్థిరాస్తి లావాదేవీలు, రూ.5 లక్షలకు పైగా వాహన కొనుగోలు, రూ.1 లక్షకు పైబడిన హోటల్, ఈవెంట్ చెల్లింపులు, ప్రతి బీమా పాలసీ కొనుగోలుకు పాన్ తప్పనిసరి చేశారు. రైల్వే టికెట్ రద్దు నిబంధనల్లో కూడా మార్పులు చేశారు. రైలు బయల్దేరే సమయానికి 8 గంటలలోపు టికెట్ రద్దు చేస్తే రీఫండ్ ఉండదు. ముందస్తు రద్దులపై కూడా శాతం వారీగా డిడక్షన్లు అమలు చేస్తారు. ఇక పంజాబ్ నేషనల్ బ్యాంకు ఏటీఎం నగదు ఉపసంహరణ పరిమితులను కొన్ని డెబిట్ కార్డులపై తగ్గించింది. మరోవైపు ఎల్‌పీజీ సిలిండర్ ధరలపై కూడా ఏప్రిల్ 1న సమీక్ష జరగనుంది. విమాన ఇంధన ధరలను కూడా పునర్విమర్శించే అవకాశం ఉంది. ఈ మార్పులు ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రజలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ముందస్తుగా అవగాహన అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

# ఐపీఎల్-19లో ముంబై తొలి విక్టరీ



ఐపీఎల్ 19వ సీజన్‌ను ముంబై ఇండియన్స్ విజయంతో ఘనంగా ఆరంభించింది. తమకు అలవాటైన 'ఆరంభ మ్యాచ్ ఫోబియా'ను అధిగమిస్తూ, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ముంబై అలవోకగా ఛేదించింది. వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఈ హైవోల్టేజ్ పోరులో 6 వికెట్ల తేడాతో గెలుపొందిన హార్దిక్ సేన, టోర్నీలో శుభారంభం చేసింది. 221 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌కు ఓపెనర్లు రోహిత్ శర్మ (78), రియాన్ రికెల్టన్ (81) కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చారు. పవర్ ప్లేలోనే ఈ ద్వయం 80 పరుగులు రాబట్టి కేకేఆర్ బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టింది. రోహిత్ తన ట్రేడ్ మార్క్ 'పుల్ షాట్ల'తో విరుచుకుపడగా, రికెల్టన్ స్టన్నింగ్ షాట్లతో అలరించాడు. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి వేసిన ఓవర్లలో రోహిత్ బౌండరీల వర్షం కురిపించి అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. కేవలం 24 బంతుల్లోనే రికెల్టన్ కూడా హాఫ్ సెంచరీ మార్కును అందుకున్నాడు. ఓపెనర్లు ఇద్దరూ ఔటైన తర్వాత ఇంప్యాక్ట్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ (16) మెరుపులు మెరిపించాడు. చివర్లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా (18 నాటౌట్), తెలుగు తేజం తిలక్ వర్మ (20) ఆడుతూపాడుతూ లక్ష్యాన్ని పూర్తి చేసి ముంబైకి రెండు పాయింట్లు అందించారు. దీంతో కొండంత లక్ష్యం కాస్తా మంచు ముక్కలా కరిగిపోయింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. ఓపెనర్ అజింక్యా రహానే (67) క్లాసిక్ ఇన్నింగ్స్ కు యువ ఆటగాడు అంగ్‌క్రిష్ రఘువంశీ (51) మెరుపులు తోడయ్యాయి. డెత్ ఓవర్లలో వైస్ కెప్టెన్ రింకూ సింగ్ (33 నాటౌట్) తనదైన శైలిలో సిక్సర్లతో విరుచుకుపడటంతో కేకేఆర్ భారీ స్కోరు సాధించింది. అయితే, ముంబై బ్యాటర్ల ధాటికి కేకేఆర్ బౌలర్లు చేతులెత్తేయడంతో వారి పోరాటం వృథా అయింది.

# కావ్యా మారన్‌కు పోటీగా ఆర్‌సీబీకి అనన్య బిర్లా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



ఐపీఎల్‌లో జట్టు యజమానులు, ప్రతినిధులు స్టేడియంలో చూపే హావభావాలు అభిమానులను ఆకట్టుకునే అంశంగా మారుతున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్యా మారన్‌కు ఉన్న క్రేజ్ తెలిసిందే. ఈ నేపథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున అనన్య బిర్లా స్టేడియంలో కనిపించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. బిర్లా గ్రూప్ అధినేత కుమార మంగళం బిర్లా కుమార్తె అనన్య బిర్లా, ఐపీఎల్ 19వ సీజన్ ప్రారంభానికి ముందు ఆర్‌సీబీ యాజమాన్యంలో జరిగిన మార్పుల అనంతరం జట్టుతో అనుబంధం ఏర్పరుచుకున్నారు. యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ నుంచి ఆర్‌సీబీని ఆదిత్య బిర్లా గ్రూప్, ఇతర భాగస్వామ్య సంస్థలు కలిసిన కన్సార్టియం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్యమాన్ బిర్లా జట్టు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. శనివారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఆర్‌సీబీ- ఎస్‌ఆర్‌హెచ్ మ్యాచ్‌కు అనన్య బిర్లా, ఆర్యమాన్ బిర్లా హాజరయ్యారు. ఆర్‌సీబీ జెర్సీ ధరించి జెండాను ఊపుతూ అభిమానులను ఉత్సాహపరిచిన అనన్య, తన హావభావాలతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఒకవైపు కావ్యా మారన్ ఎస్‌ఆర్‌హెచ్ జట్టుకు మద్దతు ఇస్తుండగా, మరోవైపు అనన్య బిర్లా ఆర్‌సీబీకి ఉత్సాహం నింపడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా, అనన్య బిర్లా భవిష్యత్తులో ఆర్‌సీబీ మ్యాచ్‌లకు నిరంతరం హాజరవుతారా అన్నది ఆసక్తికరంగా మారింది. విరాట్ కోహ్లీ భార్య అనుష్క శర్మతో కలిసి ఆమె మ్యాచ్‌ను వీక్షించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అనన్య బిర్లా 1994లో ముంబైలో జన్మించారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె ప్రస్తుతం ఆదిత్య బిర్లా గ్రూప్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆమె హాజరు కొనసాగుతుందా లేదా అన్నది వేచిచూడాల్సి ఉంది.



## చిన్నారుల జ్ఞాపకార్థం ఇరాన్ నివాళి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఫిఫా ప్రపంచ కప్ సన్నాహాల్లో భాగంగా నైజీరియాతో జరిగిన మ్యాచ్‌లో ఇరాన్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు మానవతా భావాన్ని చాటింది. అమెరికా బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారులకు సంతాపంగా ఇరాన్ ఆటగాళ్లు ప్రత్యేకంగా నివాళులు అర్పించారు. మ్యాచ్‌కు ముందు జాతీయ గీతాలాపన సమయంలో ఇరాన్ ప్లేయర్లు గులాబీ, ఊదా రంగుల చిన్న బ్యాక్‌ప్యాక్‌లను ధరించి చిన్నారుల జ్ఞాపకాన్ని స్మరించుకున్నారు. అలాగే నల్ల రిబ్బన్లు కట్టుకుని మైదానంలోకి దిగారు. ఈ భావోద్వేగ చర్యతో ఇరాన్ జట్టు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది.

## హైదరాబాద్‌లో స్పోర్ట్స్ హ్యాకథాన్ వేడుకలు స్టార్ట్




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం స్పోర్ట్స్ హ్యాకథాన్ ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీఐటీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ హ్యాకథాన్ రెండు రోజుల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా టీఐటీఏ అధ్యక్షుడు సందీప్‌కుమార్ మాట్లాడుతూ, బాస్కెట్‌బాల్, ఫెన్సింగ్, కబడ్డీ, బ్యాడ్మింటన్, పవర్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ సహా మొత్తం 24 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులు ఎదుర్కొంటున్న ఫిట్‌నెస్, శారీరక, సాంకేతిక సమస్యలను విశ్లేషించి, వాటికి సాంకేతిక పరిష్కారాలు అందించే దిశగా ఈ హ్యాకథాన్ పనిచేస్తుందని చెప్పారు. దేశంలో తెలంగాణను స్పోర్ట్స్ ఇన్నోవేషన్ హబ్‌గా అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# కీ మెటల్ ట్యాగ్ ప్రాముఖ్యతపై అవగాహన అవసరం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



కొత్తగా వాహనం కొనుగోలు చేసినప్పుడు తాళం చెవితో పాటు ఇచ్చే చిన్న మెటల్ ట్యాగ్‌ను చాలామంది పెద్దగా పట్టించుకోరు. అయితే ఆ ట్యాగ్ కీలకమైన సమాచారాన్ని కలిగి ఉండటం వల్ల దానిని నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ఈ మెటల్ ట్యాగ్‌పై ప్రత్యేకమైన 'కీ కోడ్' నమోదు చేసి ఉంటుంది. వాహన తాళాలు పోయినప్పుడు లేదా దెబ్బతిన్నప్పుడు ఈ కోడ్ ఆధారంగా అధీకృత సర్వీస్ కేంద్రాల ద్వారా సులభంగా కొత్త తాళాన్ని పొందవచ్చు. కోడ్ అందుబాటులో లేకపోతే మొత్తం లాక్ వ్యవస్థను మార్చాల్సి రావడం వల్ల అదనపు ఖర్చు భరించాల్సి వస్తుంది. ప్రస్తుతం స్మార్ట్ కీలు వినియోగంలో ఉన్న నేపథ్యంలో, వాటిలో ఉండే ఎమర్జెన్సీ ఫిజికల్ కీ తయారీలో కూడా ఈ కోడ్ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ఈ కీ కోడ్ భద్రతపరంగా కూడా ముఖ్యమైనదే. అనధికారుల చేతికి చేరితే డూప్లికేట్ తాళం తయారీకి అవకాశం ఉండటంతో జాగ్రత్తగా భద్రపరచాలని సూచిస్తున్నారు. తాళంతో పాటు కాకుండా వాహన పత్రాలతో కలిపి భద్రపరచడం, అవసరమైతే కోడ్‌ను ఫొటో లేదా డిజిటల్‌గా నిల్వ చేసుకోవడం మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు.

# ఏఐ వచ్చినా.. ఈ ఉద్యోగాలు సేఫ్


**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



అమెరికా, కృత్రిమ మేధస్సు (ఏఐ) అన్ని రంగాల్లో వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఉద్యోగాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాకు చెందిన రక్షణ సాంకేతిక సంస్థ పలాంటిర్ టెక్నాలజీస్ సీఈఓ అలెక్స్ కార్ప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఏఐ ప్రభావం వల్ల కొన్ని వృత్తులు ప్రమాదంలో పడే అవకాశమున్నప్పటికీ, రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు మాత్రం భవిష్యత్తులో స్థిరంగా నిలుస్తారని తెలిపారు. మొదటిగా వృత్తి ఆధారిత నైపుణ్యాలు కలిగిన వారు. మెకానిక్‌లు, ఎలక్ట్రిషియన్‌లు, టెక్నీషియన్స్ వంటి ప్రాక్టికల్ పనులు చేసే వారిని పూర్తిగా ఏఐతో భర్తీ చేయడం కష్టమని పేర్కొన్నారు. ఇక రెండవ వర్గంగా 'న్యూరోడైవర్జెంట్' వ్యక్తులను పేర్కొన్నారు. సాధారణ ఆలోచనా విధానానికి భిన్నంగా ఆలోచించే వారు, సృజనాత్మకతతో సమస్యలకు కొత్త పరిష్కారాలు కనుగొనేవారు ఈ వర్గంలోకి వస్తారని చెప్పారు. ఇలాంటి వ్యక్తులు భవిష్యత్తులో ఎక్కువ అవకాశాలను సొంతం చేసుకుంటారని అభిప్రాయపడ్డారు. అదే సమయంలో సంప్రదాయ విధానాల్లో జరిగే పనులు, ముఖ్యంగా సాధారణ కోడింగ్, లా వర్క్, చదవడం రాయడం వంటి పనులను ఏఐ సులభంగా నిర్వర్తించగలదని తెలిపారు. ఈ రంగాల్లో పనిచేసేవారు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడం అత్యవసరమని సూచించారు. భవిష్యత్తులో సృజనాత్మకత, ఒరిజినల్ ఆలోచన, కొత్తదనాన్ని సృష్టించే సామర్థ్యాలకే అధిక ప్రాధాన్యం ఉంటుందని అలెక్స్ కార్ప్ స్పష్టం చేశారు. సమస్యలను విభిన్న కోణాల్లో విశ్లేషించి, వినూత్న పరిష్కారాలు అందించే సామర్థ్యం ఉన్నవారిని ఏఐ వచ్చినా వారి ఉద్యోగాలకు ఢోకా లేదని పేర్కొన్నారు. మొత్తంగా వృత్తి నైపుణ్యాలు కలిగిన వారు, భిన్నంగా ఆలోచించే వ్యక్తులు ఏఐ యుగంలో కూడా ముందంజలో నిలుస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.

# చికెన్ ధరల క్షీణత.. వినియోగదారులకు ఊరట

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**




గత వారం భారీగా పెరిగిన చికెన్ ధరలు ఈ వారం గణనీయంగా తగ్గి వినియోగదారులకు ఉపశమనం కలిగించాయి. మార్చి నెల ప్రారంభంలో కిలో చికెన్ ధర రూ.360 నుంచి రూ.400 వరకు నమోదైన విషయం తెలిసిందే. వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో కోళ్ల మరణాలు అధికమవడం, దాణా ఖర్చులు పెరగడం వంటి కారణాలతో కోళ్ల ఉత్పత్తుల యజమానులు ధరలను పెంచారు. ఇదే సమయంలో వివాహాలు, శుభకార్యాల సీజన్ కారణంగా డిమాండ్ పెరగడంతో చికెన్ ధరలు గరిష్ఠ స్థాయికి చేరాయి. అయితే ధరలు అధికంగా ఉండటంతో వినియోగదారులు ప్రత్యామ్నాయంగా సముద్రం నుండి లభించే ఆహారాలవైపు మళ్లడం వల్ల, సరఫరా మెరుగుపడటం వంటి కారణాలతో వారం రోజుల్లోనే చికెన్ ధరలు సుమారు రూ.100 వరకు తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో స్కిన్‌లెస్ చికెన్ కిలో ధర సుమారు రూ.270గా ఉండగా, వరంగల్‌లో కూడా ఇదే ధర కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురం ప్రాంతంలో మాత్రం ధరలు రూ.300 నుంచి రూ.350 ల మధ్య ఉన్నాయి. ఉష్ణోగ్రతల మార్పులు, కోళ్ల పెంపకం, సరఫరా పరిస్థితుల ఆధారంగా చికెన్ ధరల్లో మార్పులు చోటుచేసుకుంటాయని వ్యాపారులు పేర్కొన్నారు.



## ప్రొఫెషనల్ బాక్సింగ్‌లోకి మేరీ కోమ్ ఎంట్రీకి సిద్ధం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారత బాక్సింగ్ దిగ్గజం మేరీ కోమ్ మరోసారి రింగ్‌లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. అమెచ్యూర్ బాక్సింగ్‌కు వీడ్కోలు పలికిన ఈ ఒలింపిక్ కాంస్య పతక విజేత, ఇకపై ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నట్లు వెల్లడించింది. ఆదివారం నిర్వహించిన ఫిట్ ఇండియా 67వ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ విషయాన్ని ధృవీకరించింది. వయోపరిమితి కారణంగా దేశం తరఫున అమెచ్యూర్ బాక్సింగ్‌లో పోటీ పడే అవకాశం లేకపోవడంతో, ప్రొఫెషనల్ బాక్సింగ్ వైపు దృష్టిసారిస్తున్నట్లు పేర్కొంది. 'ఆరుసార్లు వరల్డ్ ఛాంపియన్‌షిప్ గెలవడం నా కెరీర్‌లో గొప్ప విజయంగా భావిస్తున్నా. ఈ వయసులోనూ నాలో పోరాటస్ఫూర్తి తగ్గలేదని ప్రపంచానికి చాటాలని ఉంది. ఫిట్‌గా ఉంటూ సాధ్యమైనంత కాలం బాక్సింగ్‌లో కొనసాగాలనుకుంటున్నా' అని మేరీ కోమ్ తెలిపింది. మణిపూర్‌కు చెందిన మేరీ కోమ్ భారత మహిళా బాక్సింగ్‌లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. 2002, 2005, 2006, 2008, 2010, 2018 సంవత్సరాల్లో ఆరుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఆమె, 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచి చరిత్ర సృష్టించింది. అదనంగా ఆసియా క్రీడల్లో కూడా పలు పతకాలు సాధించి తన ప్రతిభను చాటుకుంది. ప్రొఫెషనల్ బాక్సింగ్‌లోకి అడుగుపెట్టాలన్న మేరీ కోమ్ నిర్ణయం క్రీడా వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.




## మహిళా ఇన్వెస్టర్ల సంఖ్య పెరుగుతోంది

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారతీయ స్టాక్ మార్కెట్లలో మహిళా పెట్టుబడిదారుల భాగస్వామ్యం గణనీయంగా పెరుగుతోంది. పొదుపుతో పాటు సంపద సృష్టిలోనూ తమ పాత్రను బలపరుస్తూ ముందుకు సాగుతున్నారు. 2021తో పోలిస్తే మహిళల డీమ్యాట్ ఖాతాల సంఖ్య 129 శాతం పెరిగినట్లు యాక్సిస్ డైరెక్ట్ తాజా నివేదిక వెల్లడించింది. మహిళా మదుపరుల పెట్టుబడి ధోరణి పరిశీలిస్తే, స్వల్పకాలిక లాభాల కంటే దీర్ఘకాలిక ఆర్థిక భద్రతకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం పెట్టుబడుల్లో సుమారు 49 శాతం మ్యూచువల్ ఫండ్‌లలోనే పెట్టుబడులు పెట్టగా, 33 శాతం మంది క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)ను అనుసరిస్తున్నారు. ముఖ్యంగా 26 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలు సిప్‌లపై ఆసక్తి చూపుతున్నారని నివేదిక పేర్కొంది. ఇక 25 ఏళ్లలోపు యువతులు, 45 ఏళ్ల పైబడిన మహిళలు మ్యూచువల్ ఫండ్‌లలో ఏకమొత్తంగా పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గు చూపుతున్నట్లు వెల్లడైంది. నేరుగా ఈక్విటీలు, కమోడిటీలు, డెరివేటివ్స్ వంటి అధిక ప్రమాదం ఉన్న పెట్టుబడుల్లో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉండటం, వారి జాగ్రత్త ధోరణిని సూచిస్తోంది. సాంకేతిక వినియోగంలోనూ మహిళలు ముందంజలో ఉన్నారు. ఈక్విటీ పెట్టుబడుల్లో 64 శాతం ఆన్‌లైన్ వేదికల ద్వారానే జరుగుతున్నట్లు నివేదిక పేర్కొంది. మహిళలు క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి సంస్కృతిని అలవాటు చేసుకుంటున్నారని, ఈ ధోరణి కొనసాగితే భారత పెట్టుబడి రంగంలో వారు కీలక పాత్ర పోషించే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




## యుద్ధాలపై కియోసాకి కీలక వ్యాఖ్యలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అంతర్జాతీయ ఆర్థిక విశ్లేషకుడు, 'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకి యుద్ధాల ఆర్థిక ప్రభావాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం మానవత్వానికి నష్టదాయకమే అయినప్పటికీ, ఆర్థికంగా కొన్ని వర్గాలకు లాభాలు చేకూరే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన కియోసాకి, వియత్నాం యుద్ధ కాలాన్ని స్మరించుకున్నారు. ఆ యుద్ధంలో తాను పాల్గొన్న అనుభవాలను ప్రస్తావిస్తూ, తన స్నేహితులను కోల్పోయిన బాధను గుర్తుచేశారు. ఇటీవల వియత్నాం పర్యటన సందర్భంగా పాత జ్ఞాపకాలను తలుచుకుని భావోద్వేగానికి గురైనట్లు తెలిపారు. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఘర్షణలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధాల ప్రభావం కేవలం యుద్ధభూమికే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం పెరుగుదల, దేశాల అప్పుల భారంతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ధరల పెరుగుదల కారణంగా పేదరికం మరింత పెరిగే ప్రమాదం ఉందని, ఆర్థిక సంక్షోభం వల్ల అనేక మంది ఆస్తులను కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చని ఆయన విశ్లేషించారు. అయితే సంక్షోభకాలంలో సరైన ఆర్థిక అవగాహన, నిర్ణయాలతో సంపదను సృష్టించుకునే అవకాశముందని కియోసాకి సూచించారు. ఆర్థిక విద్యపై దృష్టి సారించి, సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకుంటే కష్టకాలంలోనూ ఆర్థికంగా ఎదగవచ్చని తెలిపారు.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
సోమవారం | హైదరాబాద్
30.03.2026
www.manasarkar.com



# జూలై 3న 'నాగబంధం'

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియన్ మైథలాజికల్ ఎపిక్ చిత్రం 'నాగబంధం'. నిక్ స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ బ్యానర్లపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా జూలై 3న విడుదల చేయాలని మేకర్స్ ఫిక్స్ అయ్యారు. వర్షాకాలం ప్రారంభంలోనే విడుదల చేయాలని చిత్ర బృందం నిర్ణయించుకుంది. ఈ మేరకు విడుదల తేదీ పోస్టర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో రెండు రకాల గెటప్స్ లో హీరో కనిపిస్తున్నారు. పై భాగంలో శివుడిగా హీరోగా పవర్ ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఇక కింది భాగంలో మోడ్రన్ లుక్‌లో చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఈ రెండు లుక్స్ తో డిజైన్ చేసిన పోస్టర్ ఆడియెన్స్‌లో మరింత క్యూరియాసిటీని పెంచేస్తోంది. శివుడిగా విరాట్ లుక్‌కి ఇప్పటికే అదిరిపోయే రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ పోస్టర్ అయితే నెక్స్ట్ లెవెల్లో ఉంది. ఈ చిత్రం ఇప్పటికే ఆడియెన్స్ లో భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. ఫస్ట్ గ్లింప్స్, భక్తి గీతం 'నమో రే' ఇప్పటికీ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతూనే ఉంది. ఇక రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేయడంతో టీం ప్రమోషన్స్ మీద ఫోకస్ పెట్టనుంది. ఇకపై వరుస అప్డేట్లతో ప్రేక్షకుల్లో మరింత బజ్‌ను పెంచేలా టీం ప్లాన్ చేస్తోంది. విలక్షణమైన ఇతివృత్త సమ్మేళనం, భారీ నిర్మాణ స్థాయి, శక్తివంతమైన కథా లక్ష్యంతో, 'నాగబంధం' జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఈ ఏడాదిలో అత్యంత ఆకట్టుకునే థియేట్రికల్ చిత్రాలలో ఒకటిగా 'నాగబంధం' నిలవనుంది.



# 'డెకాయిట్' అల్టిమేట్ డాన్స్ నంబర్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఏప్రిల్ 10న థియేటర్లలోకి రాబోతున్న పాన్‌ఇండియా యాక్షన్‌రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ప్రోమోలు, ఫస్ట్ సింగిల్ 'రుబారూ' ఒక రగ్గడ్ హీరోని ప్రజెంట్ చేశాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమా సెకండ్ సింగిల్ 'చిచ్చుబుడ్డి'ని విడుదల చేశారు. ఇది శేష్ క్యారెక్టర్ సరికొత్త కోణాన్ని చూపిస్తోంది. 'చిచ్చుబుడ్డి' పాట సినిమా మూడ్‌ను పూర్తిగా మార్చేస్తుంది. ఇందులో అడివి శేష్ తొలిసారిగా తెరపై డ్యాన్స్ చేస్తూ హైఎనర్జీ అవతార్‌లో అదరగొట్టారు. సంగీత దర్శకుడు భీమ్స్ సెసిరోలియో ఫోక్ బీట్‌లతో కూడిన పార్టీ జానర్ పాట కంపోజ్ చేశారు. భాస్కరభట్ల రవికుమార్ విజువల్ ఎక్స్ పీరియన్స్ కి సరిపోయే సరదా, ఆటపట్టించే సాహిత్యం అందించారు. జోనితా గాంధీ తన ఎనర్జిటిక్ వోకల్స్ తో ఈ పాటకు పవర్ యాడ్ చేశారు. తన గ్లామరస్ డ్యాన్స్ తో తెరపై కూడా మెరిశారు. భోజ్‌పురి స్టార్ పవన్ సింగ్ ప్రత్యేక పాత్రలో కనిపించి, అందరినీ కట్టుకునే మాస్ వైబ్‌ను నింపారు. భారీ, జనాలతో కూడినసెట్‌లో, కళ్లు చెదిరే కొరియోగ్రఫీతో చిత్రీకరించిన 'చిచ్చుబుడ్డి' ఒక వేడుకలా అనిపిస్తుంది. ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పిస్తున్న 'డెకాయిట్' చిత్రంలో శేష్ సరసన మృణాల్ ఠాకూర్ నటించారు. ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతుండగా, ధనుష్ భాస్కర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. జ్ఞాని నేపథ్య సంగీతం సమకూర్చారు.



# బాలీవుడ్ స్టార్‌తో తొలిసారి..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**


బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్.. టాలీవుడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో భారీ యాక్షన్ ఎంటర్టైనర్ రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ 2026 నుండి ప్రారంభం కాబోతోంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ తన వార్ డ్రామా 'మాతృభూమి' (గతంలో బ్యాటిల్ ఆఫ్ గాల్వన్) పనుల్లో బిజీగా ఉండగా, అది పూర్తయిన వెంటనే వంశీ పైడిపల్లి సినిమా సెట్స్ పైకి వెళ్లనుంది. ఈ ఏడాది చివరికల్లా షూటింగ్ పూర్తి చేసి, 2027 ఈద్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. సల్మాన్ ఖాన్ ఈ ప్రాజెక్ట్ కోసం మొదటిసారిగా ప్రాఫిట్ షేరింగ్ పద్ధతిలో పని చేస్తుండటం విశేషం. అయితే తాజా సమాచారం ప్రకారం ఇప్పుడు ఈ మూవీ నెక్స్ట్ లెవల్‌కు చేరుకుంది. ఈ సినిమాలో సల్మాన్ సరసన లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటించబోతున్నట్లు తాజా సమాచారం. 'జవాన్' సినిమాతో బాలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన నయన్, ఇప్పుడు సల్మాన్ ఖాన్‌తో తొలిసారి జోడీ కడుతుండటంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. దీనికి తోడు, ఈ సినిమాలో సీనియర్ నటుడు అనిల్ కపూర్ ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారనే వార్త ప్రాజెక్ట్ పై మరింత హైప్‌ను క్రియేట్ చేస్తోంది. దిల్ రాజు తన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ చిత్రం వంశీ పైడిపల్లికి బాలీవుడ్ డెబ్యూ కానుంది. నయనతార ప్రస్తుతం యష్ నటిస్తున్న 'టాక్సిక్' సినిమాలో నటిస్తూనే, ఈ బాలీవుడ్ ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.



# 'విచిత్ర'మైన థ్రిల్లర్!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

జ్యోతి పూర్వాజ్ ప్రధాన పాత్రలో రవి, శ్రేయ తివారి హీరో హీరోయిన్‌గా సిస్ ఫిలిమ్స్ బ్యానర్ పై సైఫుద్దీన్ మాలిక్ నిర్మాణ దర్శకత్వం లో వస్తున్న చిత్రం 'విచిత్ర'. ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ సెన్సార్ పనులు పూర్తి చేసుకుని మే 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర దర్శక, నిర్మాత సైఫుద్దీన్ మాలిక్ మాట్లాడుతూ.. ప్రపంచం మొత్తం దూరమైనా దగ్గరగా ఉండేది అమ్మ ప్రేమే" ప్రతి ఆడతల్లి గుండె తల్లడిల్లేలా సెంటిమెంట్ నేపథ్యంతో రూపొందిన సినిమా 'విచిత్ర', ఫ్యామిలీ తో కలిసి సంతోషంగా ఎంజాయ్ చేస్తూ చూసే సినిమా. ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని మే 22 న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ముఖ్యంగా చిత్రానికి జాని అందించిన మ్యూజిక్ లో అన్ని పాటలు బాగా వచ్చాయి. చిత్ర పాడిన తల్లి సెంటిమెంట్ సాంగ్ హైలెట్ గా నిలుస్తుంది. మా చిన్న సినిమాకి మీడియా సపోర్ట్ చేసి ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి అని కోరుకుంటున్నాను అన్నారు.



# అలుపెరుగని పట్టుదల

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**


చార్మింగ్ స్టార్ శర్వా 'బైకర్' కోసం అద్భుతంగా ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. వ్యక్తిగతంగా, క్రియేటివ్‌గా తనను మళ్లీ ఛాలెంజ్ చేసే పాత్ర బైకర్ రూపంలో వచ్చింది. ఇందులో అతను 18 ఏళ్ల రేసర్‌గా కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం అతను తన శరీరాన్ని, మనసును పూర్తిగా మార్చుకున్నారు. ఈ చిత్రానికి అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహించగా, యువి క్రియేషన్స్ నిర్మిస్తోంది. సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఇప్పటికే మేకర్స్ శర్వా ట్రాన్స్ ఫర్మేషన్ వీడియోను విడుదల చేయగా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఒకసారి కమిట్ అయిన తర్వాత శర్వా పూర్తిగా తనను డెడికేట్ చేశారు. ఉదయం సూర్యోదయం కంటే ముందే మొదలయ్యే రోజు, అలసటతో ముగిసేది. లాంగ్ డిస్టెన్స్ పరుగులు, కఠినమైన ట్రైనింగ్, మొబిలిటీ సెషన్స్ తో అతను తన పరిమితులను దాటాడు. ఇది కేవలం శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగా కూడా ఛాలెంజ్ గా మారింది. ఈ ప్రయాణంలో యోగా అతనికి కీలకంగా నిలిచింది. జిమ్ అతనికి బలం, సహనం ఇచ్చినప్పుడు, యోగా అతని ఆలోచనలను ప్రశాంతం చేసి, ఫోకస్‌ను పెంచింది. ఈ ఫెరోసిటీ, ప్రశాంతత కలయికే అతని మార్పుకు బలం అయింది. దీంతో అతను బరువు తగ్గి, మరింత షార్ప్ లుక్‌తో పాటు కొత్త కాన్ఫిడెన్స్ ను పొందారు. బైకర్ ఏప్రిల్ 3 విడుదలకు సిద్ధమవుతుండగా, శర్వా కొత్త అవతార్‌కి అద్భుత స్పందన వస్తోంది. శర్వా మాట్లాడుతూ.. షూటింగ్ మొదటి రోజు అద్దంలో చూసుకున్నప్పుడు, నేను సిద్ధంగా ఉన్న, క్రమశిక్షణతో ఉన్న, అప్‌డేటెడ్ వ్యక్తిని చూశాను. ఈ ప్రయాణం నాకు ఒక విషయం నేర్పింది.. ఎంత నిరాశలో ఉన్నా.. ఒక నిర్ణయం తీసుకుంటే పూర్తిగా మారిపోవచ్చు. ఏప్రిల్ 3న మీరు స్క్రీన్‌పై విక్కీని చూస్తే, అది కేవలం నటన కాదు – రెండు సంవత్సరాల కష్టం, మారాలనే పట్టుదల ఫలితాన్నిని చూస్తారు'' శర్వా చెప్పినట్లే, తన మార్పు ఒక సందేశం.. ఎంత నిరాశలో ఉన్నా, తిరిగి పైకి రావడం సాధ్యమే.

# రాజీ పడొద్దు..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



టాలీవుడ్ క్వీన్ సమంత ప్రస్తుతం సినిమాలతో పాటు మహిళా సాధికారతపై తన గంభీరమైన గొంతుకను వినిపిస్తోంది. ఇటీవల హాలీవుడ్ రిపోర్టర్ నిర్వహించిన 'ఉమెన్ ఇన్ ఎంటర్‌టైన్‌మెంట్ 2026' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, సినీ రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పై కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడారు. గతంలో మలయాళ చిత్ర పరిశ్రమలో 'హేమ కమిటీ' రిపోర్ట్ సృష్టించిన కలకలం నేపథ్యంలో, తెలుగు ఇండస్ట్రీలోనూ మహిళా రక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఉండాలని డిమాండ్ చేసిన సమంత, ఇప్పుడు మరోసారి తన అభిప్రాయాలను బలంగా చాటారు. ఈ కార్యక్రమంలో సమంత మాట్లాడుతూ.. 'సమాజంలో మహిళలు ఇతరుల కోసం తమ ఇష్టాలను, లక్ష్యాలను వదులుకుంటున్నారు. దురదృష్టవశాత్తూ ఇదొక త్యాగం అని గుర్తించలేనంతగా మనం దీనికి అలవాటు పడిపోయాం. ఏదైనా చిన్న విషయం జరిగితే పురుషుల కంటే మహిళలే పది రెట్లు ఎక్కువగా క్షమాపణలు చెబుతుంటారు. ఇకపై దేనికీ రాజీ పడొద్దు, క్షమాపణలు చెప్పడం మానుకోండి. ఇది మీరు కష్టపడి సంపాదించుకున్న గౌరవం' అని పిలుపునిచ్చారు. మహిళలు తమ వ్యక్తిత్వాన్ని చాటుకోవాలే తప్ప, అనవసరంగా తలవంచకూడదని ఆమె స్పష్టం చేశారు. అలాగే భారతదేశంలో సినీ రంగం మహిళలకు అంత సురక్షితం కాదని సమంత ఆవేదన వ్యక్తం చేశారు.. 'ఉద్యోగ భద్రత, పనిగంటలు, రక్షణ వంటి ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ మహిళలు ఇండస్ట్రీలోకి వస్తున్నారంటే వారికి అపారమైన ధైర్యం ఉందని అర్థం. ఇక్కడ పురుషుల కంటే మహిళలే ఎక్కువ కష్టపడాల్సి వస్తోంది. అలాగే సినిమాలను మేల్ ఓరియెంటెడ్, లేడీ ఓరియెంటెడ్ అని విడదీసి చూడటం ఆపాలి. హీరోయిన్ అంటే కేవలం గ్లామర్ కోసమో, హీరో చుట్టూ తిరగడానికో కాదు.. కథానాయకుడిలో ధైర్యాన్ని నింపే పవర్‌ఫుల్ పాత్రలు ఉండాలి.



# 'పెద్ది' కోసం 'లెనిన్' త్యాగం!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' చిత్రం ఏప్రిల్ 30న రిలీజ్ కానున్న నేపథ్యంలో 'లెనిన్' టీం ఓ నిర్ణయాన్ని తీసుకుంది. రామ్ చరణ్‌తో అఖిల్ అక్కినేనికి, టీంకు ఉన్న బాండింగ్ కారణంగా సహృదయంతో 'లెనిన్' సినిమాని వాయిదా వేశారు. మే 1న ప్రపంచవ్యాప్తంగా విడుదల కావాల్సి ఉన్న 'లెనిన్' చిత్రాన్ని జూన్ 26న విడుదల చేయనున్నారు. ఏప్రిల్ 30న విడుదల కానున్న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' కోసమే 'లెనిన్' మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నారు. పరస్పర గౌరవంతో పాటుగా, ఎక్కువ సంఖ్యలో థియేటర్ల లభ్యత, సానుకూల వాతావరణాన్ని కల్పించేందుకు, 'లెనిన్' బృందం విడుదలను వాయిదా వేసింది. రామ్ చరణ్, అఖిల్ అక్కినేనిల మధ్య ఉన్న ఆత్మీయ బంధం గురించి అందరికీ తెలిసిందే. ఇదే విషయాన్ని నిర్మాతలు చెబుతూ ఈ నిర్ణయం పరిశ్రమలో సద్భావనను, ఐక్యతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని అన్నారు. 'లెనిన్' మూవీని మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్నారు. బలమైన భావోద్వేగాలు, ఆకట్టుకునే కథనంతో ఒక కంప్లీట్ సినిమాటిక్ ఎక్స్ పీరియెన్స్ అందించేలా చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాని అత్యుత్తమ రూపంలో అందించి, ప్రేక్షకులకు చిరస్మరణీయమైన సిల్వర్ స్క్రీన్ ఎక్స్ పీరియెన్స్ ను కలిగిస్తామని చిత్ర బృందం హామీ ఇస్తోంది. ఈ చిత్రానికి థమన్ ఎస్ సంగీతం అందిస్తున్నారు. ఆయన మ్యూజిక్, ఆర్ఆర్ సినిమా స్థాయిని పెంచేలా ఉంటుందని సమాచారం. 'లెనిన్' కోసం వెయిట్ చేస్తున్న, సపోర్ట్ చేస్తున్న ప్రతీ ఒక్క ప్రేక్షకుడికి మేకర్స్ కృతజ్ఞతలు తెలిపారు.



# గోల్డెన్ ఛాన్స్!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లకు పోటీ అనేది సర్వసాధారణం. అయితే ఆ పోటీని తట్టుకుని నిలబడటం, కెరీర్‌ను గాడిలో పెట్టుకోవడం అంత సులభం కాదు. ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోలందరి సరసన నటిస్తూ 'గోల్డెన్ లెగ్' అనిపించుకున్న బుట్టబొమ్మ పూజా హెగ్డే.. ప్రస్తుతం కెరీర్ పరంగా కొంత ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. వరుస ఫ్లాపులు, ఆశించిన స్థాయిలో హిట్లు లేకపోవడంతో ఈ భామ రేసులో వెనుకబడిపోయింది. ఇతర భాషల్లో స్పెషల్ సాంగ్స్, చిన్న చిన్న పాత్రలు చేస్తున్నప్పటికీ, తెలుగులో మాత్రం ఆమె నటించి చాలా కాలమైంది. ఈ నేపథ్యంలో, తన ఉనికిని చాటుకోవడానికి పూజా హెగ్డే ఇప్పుడు గట్టి ప్రయత్నాలే చేస్తోంది. తాజా సమాచారం ప్రకారం, యంగ్ హీరో శర్వానంద్, వినోదాత్మక చిత్రాల దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్ లో రాబోతున్న 'జార్జ్ క్రిష్' సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా ఖరారైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకున్న పూజా, ఈ క్రేజీ ప్రాజెక్ట్ తో మళ్ళీ టాలీవుడ్‌లోకి గ్రాండ్ రీఎంట్రీ ఇవ్వాలని ప్లాన్ చేస్తోంది. శర్వానంద్ కూడా ఈ సినిమా కోసం తన లుక్‌ను పూర్తిగా మార్చుకుంటున్నారని, జూన్ నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. మొదటి షెడ్యూల్‌లోనే శర్వానంద్‌పై ఒక భారీ ఎంట్రీ సీన్‌ను చిత్రీకరించేందుకు దర్శకుడు శ్రీను వైట్ల ప్లాన్ చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ వంటి పెద్ద నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తుండటంతో, పూజా హెగ్డేకు ఇది ఒక గోల్డెన్ ఛాన్స్ అని చెప్పాలి. శ్రీను వైట్ల సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు కూడా చాలా ఫన్నీగా, బబ్లీగా ఉంటాయి. కాబట్టి, ఈ సినిమా హిట్టయితే పూజా హెగ్డే మళ్ళీ టాలీవుడ్‌లో బిజీ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరి ఈ 'జార్జ్ క్రిష్' పూజా హెగ్డే కెరీర్‌కు ఏ మేరకు ప్లస్ అవుతుందో చూడాలి.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027 Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**